నమ్మలేని నిజాలు

చిన్న చేపలు
ఎన్నికల సముద్రం
పైసల వల

రిక్త హస్తాలు
జనం డబ్బులు దానం
నేత కర్ణులు

కోటి దీపాలు
తుపానుకు మలుగు
చైతన్య దీపం

పాత బావులు
తెరపైకి చరిత్ర
నీటి దారులు

నేతల అహం
చెట్టులా పెరిగింది
ఓట్ల తుపాను

- రేడియమ్
సెల్: 9291527757

నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

నిజాలు

సర్కారు బళ్ళల్లోకి
కూడ నాయకుల పిల్లలు !
ముఖ్యమంత్రి ఆర్డరిస్తె
హర్షిస్తార్ కోకొల్లలు !

ఫేక్ న్యూస్ అబద్ధాన్ని
నిజం చేస్తె రేవంతుడు
కత్తిలాగ దూసుకెళ్లె
కొత్త బాసు పనిమంతుడు

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ గురువారం 21-12-2023 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No.L1/HQ/SD/258/2021-2023 సంపుటి :30 సంచిక:113 పేజీలు:6 వెల: రూ.1/-

చేనేత పరిశ్రమతో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి-రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

యాదాద్రి భువనగిరి , డిసెంబర్ 20:చేనేత పరిశ్రమతో గ్రామీణ ప్రాంత ప్రజలకు మంచి ఉపాధి దొరుకుతుందని, తెలంగాణ రాష్ట్రం మంచి చేనేత వస్త్రాలను అందిస్తున్నదని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారు. రాష్ట్రపతి భూదాన్ పోచంపలిలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోచంపల్లి, వరంగల్, సిరిసిల్ల వస్త్రాలకు ట్యాగ్ రావడం అభినందనీయమన్నారు. పోచంపల్లి చేనేత వస్త్రాలను చూస్తే సంతోషం కలిగింది..భారత సంస్కృతి సంప్రదాయాల్లో చేనేత ఒకటని పేర్కొన్నారు. యూఎన్ఏ భూదాన్ పోచంపల్లిని ప్రపంచ గ్రామీణ పర్యాటక ప్రాంతంగా గుర్తించడం ఈ ప్రాంతానికే గర్వకారణమన్నారు. ప్రభుత్వం ద్వారా చేనేత కళాకారులకు మద్దతు దొరుకుతుందని, చేనేత వస్త్రాల కళను వారసత్వంగా మరొకరికి అందించడం ప్రశంసనీయమన్నారు.చేనేత రంగాన్ని కాపాడుకునే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. చేనేత అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. అలాగే గ్రామీణ ప్రాంత వృత్తులను కాపాడుకోవాలని, మా ప్రాంత ప్రజలను పోచంపల్లికి తీసుకువస్తానని రాష్ట్రపతి పేర్కొన్నారు.కాగా, శీతాకాల విడిదిలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చిన ఆమె.. బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో పోచంపల్లికి వెళ్లారు. ముందుగా పట్టణంలోని టూరిజం సెంటర్, ఆచార్య వినోబాబావే భవనానికి వెళ్లిన రాష్ట్రపతి.. భూదాన ఉద్యమకారులైన వినోబా బావే, వెదిరె రామచంద్రారెడ్డి విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం వినోబాబావే భవనంలో ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. పోచంపల్లి టై అండ్ డై, ఇక్కత్ చీరెలను తయారీని పరిశీలించారు. అంతకు ముందు అధికారులు ఆమెకు ఘన స్వాగతం పలికారు.

తప్పుల తడకగా ఆర్థిక శ్వేతపత్రం.. గత ప్రభుత్వాన్ని బద్నాం చేసే ధోరణి ఎక్కువగా ఉంది : హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబర్ 20:రాజకీయ కారణాల రీత్యా కాంగ్రెస్ నాయకులు ఒప్పుకున్నా.. ఒప్పుకోకపోయినా.. తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా బలపడటానికి బీఆర్ఎస్ ప్రభుత్వం బలమైన పునాదులు వేసిందని హరీశ్‌రావు అన్నారు. సువిశాలమైన ప్రగతి దారులను నిర్మించిందన్నారు. కొత్త ప్రభుత్వం ఆ దారుల వెంట ముందడుగు వేస్తూ ప్రజలే కేంద్రంగా పనిచేయాలన్నారు. రాజకీయ కక్షల చుట్టూ పరిభ్రమించే వైఖరికి భిన్నంగా.. అభివృద్ధి కక్షలో పరిభ్రమిస్తే వారికి మంచిది.. ప్రజాస్వామ్య వ్యవస్థలకు మంచిదని సూచించారు. కానీ ఈ సభలో ముఖ్యమంత్రి మాట్లాడిన తీరు.. శ్వేతపత్రం తీరును చూస్తుంటే ప్రజలు, ప్రగతి అనే కోణం కన్నా.. రాజకీయ ప్రత్యర్థులపై దాడి, వాస్తవాల వక్రీకరణ కోణమే కనిపిస్తుందన్నారు.

ఆర్థిక శ్వేతపత్రం పేజి 5లో కర్ణాటక రాష్ట్రానికి సంబంధించి బడ్జెట్ అంచనా– వ్యయాలకు సంబంధించి కాగ్ రిపోర్టు చూశామని హరీశ్‌రావు తెలిపారు. అందులో బడ్జెట్ అంచనా 2,31,142 కోట్లు ఉంటే.. 2,31,642 కోట్లుగా చూపించారన్నారు. వ్యయాల్లో కూడా 2,61,932 కోట్లు అని చూపించారని.. కాగ్ రిపోర్టు ఆధారంగా 2,54,525 కోట్లు ఉందన్నారు. అంటే.. దాదాపు 7 వేల కోట్ల ఎక్సపండిచర్ ఎక్కువగా చూపించారని తెలిపారు. మొత్తంగా తప్పుల తడకగా వివరాలు పొందుపరిచారని పేర్కొన్నారు. గత ప్రభుత్వాన్ని బద్నాం చేయాలనే ధోరణి ఇందులో కనిపిస్తుందన్నారు.

47 ఏళ్లలో లేనివిధంగా కుండపోత వర్షంతో అతలాకుతలమైన తమిళనాడు.. 10 మంది మృతి

న్యూఢిల్లీ, డిసెంబర్ 20:గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల (ఊవజీలఎ ఖీజీతినిబ)తో తమిళనాడు (ంజీఎతిశ్రీ ఔజీటబీ) రాష్ట్రం అతలాకుతలమవుతోంది. పది రోజుల కిందట మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో తమిళనాడు వ్యాప్తంగా వరదలు సంభవించిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి రాష్ట్రాన్ని భారీ వర్షాలు వణికిస్తున్నాయి. తమిళనాడులోని దక్షిణ జిల్లాల్లో గత మూడు రోజులుగా వర్షాలు దంచికొడుతున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో సంభవించిన వరదలకు జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎయిర్ ఫోర్స్ హెలికాప్టర్ల ద్వారా ఆహార పొట్లాలు, నిత్యవసర సరకులు అందిస్తున్నారు.దక్షిణాది జిల్లాలు, ప్రత్యేకించి తిరునల్వేలి, టుటికోరిన్ జిల్లాల్లో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైనట్లు తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివ దాస్ మీనా తెలిపారు. 24 గంటల్లో తిరునెల్వేలిలో సుమారు 670 మిల్లీమీటర్లు, టుటికోరిన్‌లో 932 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు చెప్పారు. భారీ వర్షాల కారణంగా ఆ రెండు జిల్లాలకు చెందిన 10 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. గోడ కూలి కొందరు, విద్యుదాఘాతంతో కొందరు మరణించినట్లు ఆయన వెల్లడించారు.మరోవైపు భారీ వర్షాల నేపథ్యం లో పలు జిల్లాల్లో పాఠశాలలు, కళాశాలలకు అధికారులు సెలవు ప్రకటించారు. తిరునల్వేలి, తెన్‌కాసి, తూత్తుకుడి జిల్లాల్లో అన్ని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. మరోవైపు బుధవారం కూడా పలు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. నాగర్‌కోయిల్–కన్యాకుమారి, నాగర్‌కోయిల్–తిరునెల్వేలి స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను పూర్తిగా రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు.. ఆరుగురు మావోయిస్టులు హతం!

న్యూఢిల్లీ, డిసెంబర్ 20:ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా వనాంచల్ ప్రాంతంలో మావోయిస్టులు, భద్రతాబలగాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. సుక్మా జిల్లాలో నక్సలైట్లు శిబిరాలు ఏర్పాటు చేసుకున్నారనే సమాచారంతో భద్రతా దళాలు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మరణించినట్లు సమాచారం. ఘటనాస్థలి నుంచి భారీ మొత్తంలో ఆయుధాలు, వస్తు సామగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టుల శిబిరాన్ని కూడా కూల్చేశాయి.

నేటి కందం– నేటికి అందం

నేరుగ"శిక్షణ"నొసగగ
భారత దేశంబు "శాతవాహన" యనగన్
తీర "జలాంతర్గామి"ని
తీరుగ నుంచెను "విశాఖ" తీరములోనన్

(21-12-1974 న ప్రభుత్వం శాతవాహన అనే శిక్షణా జలాంతర్గామిని విశాఖ తీరంలో నెలకొల్పింది)

–రాధశ్రీ
సెల్:9494481210

తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల..

హైదరాబాద్, డిసెంబర్ 20: తెలంగాణ అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేసింది. మొత్తం 42 పేజీలతో ఉన్న శ్వేతపత్రాన్ని ఆర్థిక మంత్రి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టారు.. కాగా తెలంగాణలో మొత్తం అప్పులు రూ.6,71,757 కోట్లు అని తెలిపింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటికి రాష్ట్రం అప్పులు రూ.72,658 కోట్లు అని పేర్కొం ది. పదేళ్లలో సగటున 24.5 శాతం రాష్ట్ర అప్పులు పెరిగినట్లు ప్రభుత్వం పేర్కొంది. 2023-24 అంచనాల ప్రకారం రాష్ట్ర రుణం రూ.3,89,673 కోట్లు అని ప్రభుత్వం పేర్కొంది.

ప్రభుత్వ కార్పొరేషన్లలో తీసుకున్న అప్పులు రూ.59వేల 414 కోట్లు అని తెలిపింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 10 రెట్లు రుణ భారం పెరిగిందని శ్వేత పత్రంలో వెల్లడించింది. రెవెన్యూ రాబడిలో 34 శాతానికి రుణ చెల్లింపుల భారం పెరిగిందని ప్రభుత్వం పేర్కొంది. రెవెన్యూ రాబడిలో 35 శాతం ఉద్యోగుల జీతాలకు వ్యయం అవుతున్నట్లు స్పష్టం చేసింది.

2015-16లో రుణ, జీఎస్డీపీ 15.7 శాతంతో దేశంలోనే అత్యల్పంగా ఉందని పేర్కొంది. 2023-24 నాటికి రుణ, జీఎస్డీపీ 27.8 శాతానికి పెరిగిందని తెలిపింది. బడ్జెట్‌కు, వాస్తవ వ్యయానికి మధ్య 20 శాతం అంతరం ఉన్నట్లు సర్కారు క్లారిటీ ఇచ్చింది. 57 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధికి రూ.4.98 లక్షల కోట్లు వ్యయం అయినట్లు వెల్లడించింది. ప్రతి రోజూ వేస్ అండ్ మీన్స్‌పై ప్రభుత్వం ఆధారపడాల్సిన దుస్థితి ఉందని స్పష్టం చేసింది. 2014లో తెలంగాణ మిగులు రాష్ట్రంగా ఉందని శ్వేతపత్రంలో ప్రభుత్వం పేర్కొంది.

కాగ్ నివేదికలోని కీలశ్వేతపత్రంలోని ప్రధానాంశాలు..

రాష్ట్ర మొత్తం అప్పులు -6,71,757 కోట్లు.

2014-15 నాటికి రాష్ట్ర రుణం -72,658 కోట్లు.

2014-15 నుంచి 2022-23 మధ్య కాలంలో సగటున 24.5 శాతం పెరిగిన అప్పు.

2023-24 అంచనాల ప్రకారం రాష్ట్ర రుణం -3,89,673 కోట్లు.

2015-16లో రుణ, జీఎస్డీపీ 15.7 శాతంతో దేశంలోనే అత్యల్పం.

2023- 24 నాటికి 27.8 శాతానికి పెరిగిన రుణ, జీఎస్డీపీ శాతం.

బడ్జెట్‌కు, వాస్తవ వ్యయానికి మధ్య 20శాతం అంతరం.

57 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధికి -4.98 లక్షల కోట్ల వ్యయం.

రాష్ట్రం ఏర్పడిన తర్వాత 10 రెట్లు పెరిగిన రుణభారం.

రెవెన్యూ రాబడిలో 34 శాతానికి పెరిగిన రుణ చెల్లింపుల భారం

రెవెన్యూ రాబడిలో ఉద్యోగుల జీతాలకు 35 శాతం వ్యయం.

కొత్త సాంకేతికతతో జాగ్రత్త.. డీప్‌ఫేక్ వీడియోలపై ప్రజలను హెచ్చరించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 20: డీప్‌ఫేక్ వీడియోలు, ఫొటోలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ (ఖఓ ఓనీటతి) మరోసారి స్పందించారు. కొత్త టెక్నాలజీతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలను హెచ్చరించారు. 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్' ముగింపు సందర్భంగా విద్యార్థులతో మోదీ ముచ్చటించారు. ఈ సందర్భంగా కొత్త టెక్నాలజీలను ఉపయోగిస్తున్నప్పుడు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని మోదీ నొక్కి చెప్పారు.

'కొత్త సాంకేతికతతో మనం జాగ్రత్తగా ఉండాలి. వాటిని ఎంత జాగ్రత్తగా ఉపయోగిస్తే అవి మానవాళికి అంత ఉపయోగకరంగా ఉంటాయి. కానీ, ఆ సాంకేతికతను దుర్వినియోగం చేస్తే.. అతి పెద్ద సమస్యలను సృష్టించగలదు. కృత్రిమ మేధ సాయంతో రూపొందించిన వీడియోలు, చిత్రాలు నిజమైనవిగా కనిపిస్తాయి. అలాంటి వాటిని నిజమని నమ్మేందుకు ముందు వాటి ప్రామాణికతను సరిచూసుకోవాలి' అని ప్రధాని మోదీ అన్నారు.

కాగా, డీప్‌ఫేక్ వీడియోస్ .. ఈ పదం ప్రస్తుతం దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనంగా మారింది. అందుకు కారణం పలువురు సినీ తారల మార్ఫింగ్ వీడియోలు వైరల్ కావడమే. ప్రముఖ సినీ తారలు రష్మిక మందన్నా కత్రినా కైఫ్, కాజోల్, అలియా భట్ సహా పలువురు స్టార్ తారల ఫేక్ వీడియోలు ఇటీవలే తెగ వైరల్ అయిన విషయం తెలిసిందే. ఈ మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సినీఇండస్ట్రీని తీవ్ర కలవరానికి గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో డీప్‌ఫేక్ వీడియోలపై ప్రధాని మోదీ గతంలోనూ ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. డీప్‌ఫేక్ వీడియోలు, ఫొటోలను సృష్టించడానికి కృత్రిమ మేధ ను ఉపయోగించడం సమస్యాత్మకమని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని మీడియాను కోరారు. ఇలాంటి వీడియోలు మన వ్యవస్థకు పెను ముప్పుగా మారుతున్నాయన్నారు.

డ్రగ్స్ నిర్మూలనలో అందరం కలిసి పోరాడుదాం : డీజీపీ

హైదరాబాద్, డిసెంబర్ 20:డ్రగ్స్ నిర్మూలనలో అందరం కలిసి పోరాడుదామని తెలంగాణ రాష్ట్ర డీజీపి రవి గుప్తా పిలుపునిచ్చారు. డ్రగ్స్ సరఫరాదారులు, వినియోగదారులకు తెలంగాణ డీజీపీ రవి గుప్తా హెచ్చరికలు జారీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రాన్ని డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా చేసేందుకు కృషి చేస్తోందని తెలిపారు. డ్రగ్స్ వినియోగించినా, సరఫరా చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులతో కలిసి ప్రజలంతా ముందుకు రావాలని కోరారు.

ఇక శాసనసభ ఎన్నికల సమయంలో ఈసీ ఆదేశాలతో డీజీపీ (హెడ్ ఆఫ్ ది పోలీస్ ఫోర్స్–హెచ్‌వోపీఎఫ్) గా తాత్కాలిక బాధ్యతలు చేపట్టిన రవి గుప్తానే కొనసాగించేందుకు ప్రభుత్వం మొగ్గుచూపింది. ఆయన్ని డీజీపీ (సమన్వయం)గా నియమిస్తూ.. డీజీపీ (హెచ్‌వోపీఎఫ్)గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది

ఐదు రాష్ట్రాల్లో పేరుమోసిన అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

అమరావతి, డిసెంబర్ 20:ఐదు రాష్ట్రాల్లో పేరుమోసిన అంతర్రాష్ట్ర దొంగనను పోలీసులు అరెస్టు చేశారు.మహారాష్ట్ర లోని సోలాపూర్ జిల్లా పండరీపూర్ నౌరంగి ఆశ్రమానికి చెందిన లికన్ అశోక్ కులకర్ణి అలియాస్ సచిన్ మానే ను అనంతపురం జిల్లాకు చెందిన పోలీసులు అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్ మాట్లాడుతూ రాత్రి పూట తాళం వేసిన ఇళ్లలో తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్నాడన్నారు. అనంతపురం, గుంతకల్లు, ఆలూరులలో చోరీలు చేశాడన్నారు. వీటితో పాటు ఇతను పాత నేరస్తుడని, ఆంధ్రప్రదేశ్ తో పాటు తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక, గుజరాత్ రాష్ట్రాల్లో సుమారు 80కి పైగా దొంగతనాలు చేశాడన్నారు.

కర్నాటకలోని మూడు కేసుల్లో శిక్షలు కూడా అనుభవించాడన్నారు. అతనిపై వారంట్లు పెండింగులో ఉన్నాయని, ఇటీవలే జైలు నుండి బయటికొచ్చి మళ్లీ పాత పంథా కొనసాగించాడన్నారు. ఈక్రమంలోనే అనంతపురం, గుంతకల్లు, ఆలూరులలో చోరీలు చేశాడని పోలీసులు తెలిపారు. అతని వద్ద నుంచి రూ.15లక్షల విలువ చేసే 23 తులాల బంగారు, 2 కేజీల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఐదు రాష్ట్రాల్లో పేరు మోసిన దొంగను అరెస్టు చేసిన అనంతపురం మూడవ పట్టణ సి.ఐ ధరణి కిషోర్, సిసిఎస్ సి.ఐ జి.టి నాయుడు, గుంతకల్లు ఒన్ టౌన్ సి.ఐ రామసుబ్బయ్య, ఎస్సైలు గోపాలుడు, నాగరాజుల ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుళ్లు శ్రీధర్, శ్రీనివాసులు కానిస్టేబుళ్లు ఫరూక్, రంజిత్, బాలకృష్ణ, దాస్ ను జిల్లా ఎస్పీ అభినందించారు.

28వ తేది నుంచి రూ 500కే గ్యాస్ సిలిండర్ ..

హైదరాబాద్, డిసెంబర్ 20: మహాలక్ష్మి పథకం కింద ఈ నెల 28 నుంచే గ్యాస్ సిలిండర్ ను రూ.500కు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎన్నికల హామీని అమలు చేయాలని భావిస్తోంది. ఇందుకోసం సివిల్ సప్లై శాఖ ఉన్నతాధికారులు విధివిధానాలను రూపొందిస్తున్నారు.

రాష్ట్రంలో గ్యాస్ వినియోగదారులు ఎంతమంది, ఎవరెవరికి ఈ పథకం వర్తింపజేయాలనేది నిర్ణయించనున్నారు. ఈ పథకం అమలు వల్ల రాష్ట్ర ఖజానాపై పడే భారం ఎంతనేది లెక్కలు తీస్తున్నారు. అధికార గణాంకాల ప్రకారం.. తెలంగాణలో 1.20 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. నెల నెలా 60 లక్షల సిలిండర్లు సరఫరా అవుతున్నాయి. రాష్ట్రంలోని గ్యాస్ వినియోగదారులు అందరికీ సబ్సిడీ ఇస్తే ఖజానాపై ఏటా రూ.3 వేల కోట్ల భారం పడనుందని అంచనా. అయితే, రాష్ట్రంలో మహిళల పేరుతో ఉన్న కనెక్షన్లు సుమారుగా 70 లక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మహిళల పేరుతో ఉన్న కనెక్షన్లకే సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించే అవకాశం ఉంది. అయితే, గ్యాస్ కనెక్షన్ కు సంబంధించి 'నేమ్ ఛేంజ్' ఆప్షన్ ఉండడంతో మిగతా వినియోగదారులు పేరు మార్చుకునే సౌలభ్యం ఉంది. ఈ క్రమంలోనే గ్యాస్ సబ్సిడీకి సంబంధించి గైడ్ లైన్స్ రూపొందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా ఏడాదికి మూడు సిలిండర్లను సబ్సిడీ ధరకే అందజేస్తారు.

వేంకటేశ్వర స్వామి దేవాలయం నూతన ముఖద్వారాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల



జోగులాంబ జగద్వాల , డిసెంబర్ 20:జిల్లాలోని గద్వాల నియోజకవర్గ పరిధిలోని మల్దకల్ మండలంలో వెలసిన శ్రీస్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయం నూతన ముఖద్వారం, అన్నదాన కార్యక్రమం షెడ్డును ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. అదే విధంగా దేవాలయం ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటుచేసిన అన్నదాన షెడ్డును మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత సత్య రెడ్డి తల్లిదండ్రులు వెంకటమ్మ, చిన్న వెంకట రెడ్డి జ్ఞాపకార్థంగా ఏర్పాటుచేసిన అన్నదానం షెడ్డును ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..త్వరలో జరగబోయే జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, ఆలయ చైర్మన్ ప్రహ్లాద రావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు విక్రమ్ సింహారెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, మధు, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ డైరెక్టర్ జి. శ్రీనివాసరావు స్థాన చలనం- డాక్టర్ రవీంద్ర నియామకం

హైదరాబాద్, డిసెంబర్ 20: రాష్ట్రంలో కొలువుదీరిన రేవంత్ రెడ్డి సర్కార్ తాజాగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌గా డాక్టర్ రమేశ్ రెడ్డి స్థానంలో త్రివేణిని నియమించింది. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ జి శ్రీనివాసరావు స్థానంలో డాక్టర్ రవీంద్ర నాయక్‌ను నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కాగా డీహెచ్‌గా పని చేసిన శ్రీనివాసరావు గత ప్రభుత్వంతో సన్నిహితంగా మెలిగారనే ఆరోపణలు ఉన్నాయి.

కొత్తగూడెం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయబోతున్నానని, కేసీఆర్ తనకు టికెట్ ఇస్తారని చివరి వరకు ఆశలు పెట్టుకున్నారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున నియోజకవర్గంలో పర్యటనలు చేస్తూ ప్రజలకు చేరువ అయ్యే ప్రయత్నాలు చేశారు. కానీ గులాబీ అధినేత టికెట్ నిరాకరించడంతో సైలెంట్ అయ్యారు. ఇక శ్రీనివాసరావు తీరుపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తం కాగా తాజాగా రేవంత్ రెడ్డి సర్కార్ అతడికి స్థాన చలనం కల్పించింది.

ప్రధాని అభ్యర్థిగా ఖర్గేను ప్రపోజ్ చేశా.. కేజ్రీవాల్ సపోర్ట్ ఇచ్చారు: సీఎం మమతా బెనర్జీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 20:రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి తరపున.. ప్రధాని అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే పోటీ పడే అవకాశాలు ఉన్నాయి. ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థిగా ఖర్గేను ప్రపోజ్ చేసినట్లు బెంగాల్ సీఎం మమతా బెనర్జీపేర్కొన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆమె ఇవాళ పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. ప్రధాని అభ్యర్థిగా మీ కూటమి తరపున ఎవరు ఉంటారని అందరూ అడుగుతున్నారని, అందుకే ఖర్గే పేరును సూచించినట్లు మమతా బెనర్జీ తెలిపారు. మంగళవారం జరిగిన ఇండియా కూటమి భేటీలోనూ ఖర్గే పేరు ప్రస్తావనకు వచ్చింది.అయితే పార్లమెంట్ ఎన్నికల్లో పీఎం అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఖర్గే ఆసక్తిగా ఉన్నట్లు తెలస్తోంది. తానో ఫైటర్‌ను అంటూ ఖర్గే చెప్పుకున్నట్లు సమాచారం ఉంది. తాను ఓ ఫైటర్‌ను అని, అణగారిన వర్గానికి చెందిన వ్యక్తినో లేక దళితుడినో అని చెప్పుకుని రాజకీయాలు చేయలేదని, జీవితం మొత్తం సమానత్వం కోసం పోరాడినట్లు ఇండియా కూటమి సభ్యులతో ఖర్గే చెప్పినట్లు తెలుస్తోంది. కేవలం కుల నేత తానేమీ పోరాటం చేయలేదన్నారు.

నేటినిజం
సాహితీ కిరణాలు
website:www.netinijam.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 21-12-2023

బుడ్డ పర్కలు

మానవ సంబంధాలపై
కీలకోపన్యాసం
ఇంట్ల
పిల్లికి బిచ్చంబెట్టదు.

అక్కడే ఇండియాలలోని
ముఖాలన్నీ
దాని పేరు
గోదావరి ఖని

ఆస్తులు అంతస్తులే
కాదు వారసత్వం
ఘుగరు బీ.పీ.లు
కూడా వచ్చుడే.

మట్టి అంటనోనికి
మాటలే చేతలు
మట్టి మనిషికి
చేతలే జీవితం.

-అన్నవరం దేవేందర్
9440763479

సంసారం

అజ్ఞానులు
అంటూనే ఉంటారు
విజ్ఞానులు
వింటూనే ఉంటారు

కూడికలు, తీసివేతల
జీతం
కలయికలు, చీలికల
జీవితం

ఎన్ని బాధలొచ్చినా
ఏముంది?
ఈ ప్రాణమింకా
ఇక్కడే ఉంది.

నిలదీసే వేళ
నీళ్ళు నమిలితే ఎలా?
నీ క్రిందికి
నీళ్ళొస్తాయి కదా

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

ఆమె మువ్వల మోతలు రాజ్యాధికారానికి దారి చూపుతున్నాయి

-డా॥ కత్తి పద్మారావు
9849741695

ఆ కొండల నడుమ నుండి
ప్రవహిస్తున్న సెలయేరు
ఈల పాట పాడుతూ వెళుతుంది
ఏదో పక్షి ఆ వైపుగా పయనిస్తూ
ఆ పాటను ఆలకిస్తుంది
ఆ నదీ తరంగాలలో శృతి లయలు
స్పష్టంగా వినిపిస్తున్నాయి
ఆ నీటి అలల్లో మునివేళ్లు తడుపుతున్న
ఆ గోండు భామ నీడ
ఆ తరగలకు వన్నె తెచ్చింది
నిజమే! ఆ నీటి అద్దాలు
జీవన తరంగాలకు ప్రతిబింబాలు
అనేకసార్లు నీటి చరియల్లో
సూర్యుడు తలదాచుకుంటాడు
అలలపై చంద్రుడు ఊయలలూగుతుంటాడు
ఆ కురులకు వన్నెతెచ్చిన తరగలు
రంగుల వలయాలను సృష్టించాయి
నిజమే! వాళ్లు యుద్ధానికి సిద్ధపడుతున్నారు
ఆనాడు రాజ్యాలు కోల్పోయిన వారు
మళ్లీ విల్లంబులు ఎక్కుపెట్టారు
బాణం మలుకులు పదునుదేరి ఉన్నాయి
కాదంబరిలో రాజదర్బారులో
నిలబడిన ఆ చండాలిక ఎవరో కాదు
ఆ రాజ్యం శిథిలమయ్యాక నిలబడిన
విరోచిత గాథలకు రాణి ఆమె
ఆమె పాదాల కాంతులు చూసి చక్రవర్తి తలదించాడు
ఆమె ధరించిన వస్త్రాలకు
పట్టీగా ఉన్న చిరుతచర్మాన్ని చూసి రాజు ఉలిక్కిపడ్డాడు
ఆమె వీరగాథలకు
వన్నెతెచ్చిన వీర వనిత.
గణతంత్రాల్లో మాతృస్వామిక మూలాలన్నీ
దళిత స్త్రీల దగ్గరే ఉన్నాయని గ్రహించాడు
మౌర్య రాజ్యం 'మురా 'నుండి ఏర్పడినది కాదా!?
'మురా 'ఎవరు ?
దళిత రాణి కాదా?
వీరెవరు ?నాలుగు ఆయుధాలు చేపట్టి
వచ్చిన ఆక్రమణదారులు కాదా?
ఈ పాలిగాళ్ళకు హృదయం లేదని
నెత్తురోడిన నేల ఘోషించటం లేదా?
నేరస్థ జాతులు
రూపరహితులు కారా ?
గాలిని, నీటిని, వెలుగును
తాకట్టు పెట్టే జాతులు
దురాక్రమణదారులు కాదా ?!
వారెవరు? నేరస్తులేగా?!
నెత్తురంతా ద్వేషమయమేగా?
వారి కనుల నుండి
విషవాయువులు ప్రసరించుట లేదా?
ఆ తెల్ల వస్త్రం ధరించి బడికి పోతున్న
బుడ్డోడి మీద ఆ కళ్ళు
నిప్పులు చెరగడం లేదా?
అతడు ఆకాశమంత ఎదిగాక
మీరు తలదించ లేదా?
ఒక్క బొట్టు చెమట కార్చకుండా
వందల ఎకరాలు ఎలా వీరికి స్వాధీనమయ్యాయి అని
ఈ దేశం, ఈ నేల, ఈ గాలి
వారి వైపు ఒక్కసారి ప్రశ్నల వర్షం కురిపించలేదా ?
ముఖాల్లో నెత్తురు చుక్కలేని జాతులు
కళ్ళల్లో కరుణ లేని కళేబరాలు
కామం నెత్తికెక్కిన క్రూర జంతువులు
దళితులను వెంటాడి,వేటాడి వేటాడి
మళ్లీ వేటాడే స్వేచ్ఛ కోసమేగా రాజ్యం కావాలంటున్నారు
ఎవరు వీరు?
వారి జన్మ గురించే కంగారుపడుతున్నారు?

మనుషులు మనుషులకే
పుడతారని వీరికి తెలియదా?
విత్తనాలేస్తే మట్టి నుంచి
మొలకలొస్తున్నాయి
నేలకు కులం లేదు
గాలికి, నీటికి కులం లేదు
భీష్ముణ్ణి దుర్యోధనుడు
తాతా! జన్మ! క్షేత్ర ప్రాధాన్యమా?
బీజ ప్రాధాన్యమా?అని అడగలేదా?
ఎవరు ఎవరికి పుడితే ఏముంది?
అందరూ సహజాతులేగా!
ఆ చండాల రాజ్యానికి రాజైన
వీరబాహుణ్ణి కాటికాపరిగా
ఎలా మార్చారు?
వీరబాహుడు అంటే అర్థం ఏమిటి?
యుద్ధములో వీరుడనేగా!
అతణ్ణి నిరాయుధుణ్ణి చేసి
శవాలు మోయించారుగా!!
అతను స్మశాన వాటికను అభ్యసించి
తత్వశాస్త్రాన్ని లిఖించాడు
మనిషి కాలి బూడిదయ్యాక
కుమ్మరి కుండలోనే కదా! కలిసేది
అని కవి జాషువా అనలేదా?
షట్చక్రవర్తుల్లో ఒకరైన
హరిశ్చంద్రుణ్ణి వీరబాహుడు
ఎలా కొనగలిగాడు?
ఏనుగు మీద బలవంతుడు నిలబడి
రత్నాన్ని ఆకాశానికి విసిరేంత ధనం అతనికి ఎక్కడిది?
వీరబాహుడు కాశీ చక్రవర్తి అని వారికి తెలియదా?
త్రిశంకుని కోడలు చంద్రమతి
బ్రాహ్మణుడి ఇంటిలో పనిమనిషి ఎలా అయింది ?
ఎవరు ఎవరికి బానిసలు?
నాటేసే వనిత
గట్టుమీద ఉండేవాడికి బానిసా !?
గట్టుమీద ఉన్నవాడు
నాటేసే వనితకు బానిసా!?
ఎవరు క్రియాశీలురు?
పెత్తనమా? శ్రమా?
రాజ్యం కావాలన్నప్పుడు
ఓటు కోసం ఆ సువార్తమ్మ కాళ్లు మొక్కుతున్నారుగా!
ఆ అంబేద్కర్ సూర్యుడు
దళిత పాదాలకు కాంతి తెచ్చాడు
అందుకే పాలకులు ఆ కిరణాల చుట్టూ తిరుగుతున్నారు
ఇప్పుడామె మువ్వల మోతలు
రాజ్యాధికారానికి దారి చూపుతున్నాయి
ఆమె చూపు మారింది
ఆ ద్రౌపది మూర్మును చూశాక
ఎవరి కింద ఎవరున్నారో అర్థమైంది
ఎవరి ముద్ర భారతదేశానికి
చట్టమయిందో అర్థమైంది
అందుకే ఆమె రాజ్యాధికారం వైపు నడుస్తుంది
మనమూ ఆమె వెంట నడుద్దాం

చెట్టు-మనిషి

ఆ.వె.
మట్టి మనిషికెపుడు చెట్టుతో బంధము
చెట్టు లేక బతుకు వట్టి దగును
పుట్టు వేళనుండి గిట్టునంత వరకు
నరుడు చెట్టు చుట్టు తిరుగుచుండు.

ఆ.వె.
ప్రాణవాయు విచ్చు ప్రాణులకెల్లను
బొగ్గుపులుసు గాలి పుచ్చు కొనును
కోరి నట్టు లిచ్చు గోరదు తానేది
బంధ మేమి కలదొ బమ్మ కెరుక.

ఆ.వె.
మట్టి జీల్చి వచ్చి మనిషితో జతగట్టి
నింపు మనిషి ప్రేగు నిక్కముగను
స్వార్థ మెరుగ నట్టి సాను వీమహిలోన
మనిషి చెట్టు కున్న మమత ఘనము.

-గండూరి లక్ష్మీనారాయణ
9423956248

మధుర భావాల "కలశం"...!

పుస్తక సమీక్ష

భావాలెన్ని ముసురుకుంటున్నా
వాటికి అక్షర రూపం యివ్వాలన్నా
వాక్యాన్ని రసాత్మకంగా మలచాలన్నా
కలం ఊహలకు ప్రాణం పోయాలన్నా
మదిని మథించిన సృజనే ఊపిరౌతుందని భావించే కవి డాక్టర్ చక్రపాణి యిమ్మిడిశెట్టి గారు "కలశం" పేరుతో కవితా సంపుటిని వెలువరించారు. 2004లో "రంగుల చినుకులు" ప్రచురించి కవిగా సాహితీలోకంలో తమకంటూ ఓ స్థానాన్ని పదిలపరు చుకున్నారు. వృత్తిరీత్యా వాణిజ్యశాస్త్ర అధ్యాపకులుగా సేవలందించి ఉద్యోగ విరమణ చేసి.. రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా మలుచుకున్నారు. "కవచం", పలుకే బంగారుమాయె" వంటి కవితా సంపుటులను వెలువరించిన ఆయన ఇప్పుడు "కలశం" పేరుతో మరో కవితా సంపుటిని మనకు అందిసున్నారు.

తేనెలూరే పలకరింపుల
మనసొక మధుకలశం అని భావించే డా॥చక్రపాణిగారు కరుణచూపే కనులున్న మనిషి మనసే మధుకలశమంటూ నొక్కి చెప్పారు. మోమున చిరునవ్వులున్న మనిషి మనసూ మధుకలశమేనంటూ తేల్చి చెప్పడం జరిగింది.

కవి చక్రపాణిగారు ఎంపిక చేసుకున్న కవితా వస్తువుల్లో కొత్తదనముంది. అభివ్యక్తిలో వైవిధ్యముంది. శిల్పం విషయంలో చూపిన చతురత ప్రశంసనీయంగా ఉంది. ఇందలి కవిత్వంలో ఆయన ఉత్తమ వ్యక్తిత్వాన్ని.. సున్నిత మనస్తత్వాన్ని.. సామాజిక చింతనను అడుగడుగున చూస్తాం. పదబంధ ప్రయోగంలో ఔచిత్యాన్ని పాటిస్తూ తీర్చిదిద్దిన ఇందులోని కవితల్లో అక్కడక్కడ చమత్కారాన్ని.. వ్యంగ్యాన్ని.. చరుపులు.. విరుపులను వీక్షిస్తాం.

రామయ్య వరుడంట
సీతమ్మ వధువంట
చూడచక్కనీ జంట

ఏ లోకాన లేదంటూ.. "కళ్యాణ వైభోగమే" శీర్షికన రాసిన కవితలో సీతారాముల కళ్యాణాన్ని రమణీయంగా దృశ్యమానం చేశారు. "కన్నుల పండుగ" కవితలోనూ సీతారాముల కళ్యాణాన్ని అందంగా ఆవిష్కరించారు.



ప్రతులకు:
డా॥చక్రపాణి యిమ్మిడిశెట్టి, ఎఫ్-1,
శ్రీ కన్యా అపార్ట్‌మెంట్,
నెహ్రూ చౌక్,అనకాపల్లి-531 001
సెల్: 9849331554

చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసు కుంటూ.. "మనసు పొరలలో" కవితకు రూపమిచ్చారు. ఇంట ముంగిట కొలువుదీరిన అరుగును.. అరుగుపై బాల్యంలో ఆడిన ఆటలను.. ఇరుగు పొరుగు వారి ముచ్చట్లకు అరుగు వేదిక అయిన సంఘటనలను ఏకరవు పెట్టారు.

మనసు పొరలలో కరగని కలలా అరుగు గిర గిర తిరుగుతూనే ఉందని మంచి ముగింపునిచ్చారు.

"సరికొత్త ఊపిరి" కవితలో బతుకే ఒక గాలిబంతుల ఆటయ్యాక ఊహ కందని వ్యూహాలు మొదలయ్యాక.. గెలుపైనా ఓటమైనా పోరు సాగినంత కాలం వెన్ను చూపని ధైర్యం స్ఫైర్యాలు కలిగి ఉండాలంటూ సూచించారు.

నిదరోయిన రాత్రి పరుచుకున్న చీకటి కోణాలన్నీ వెచ్చగా స్పృశించే.. ప్రభాత సమయపు వెండి వెలుగులు, ప్రకృతి కాంతను ముస్తాబుచేసే ఆభరణాలంటూ ఉషోదయాన్ని అందంగా అక్షరాల్లో బంధిస్తూ "తెల్లవారటమే సంబరం" కవితను తీర్చిదిద్దారు.

సహజమైన భాషలో.. సత్యాలెన్నో చెప్పావు. తెలంగాణ పలుకు బళ్లు వేనోళ్ల పలికించావంటూ ప్రజా కవి కాళోజీని కొనియాడుతూ "వైతాళిఖ శిఖరం" కవితకు అక్షరాకృతినిచ్చారు.

అణువణువునా వెలుగు శోభలతో మనసులో ఆశాదీపాలు వెలిగించే పండుగగా సంక్రాంతిని అభివర్ణిస్తూ "పెద్ద పండుగ" కవితను రాశారు. కర్తవ్యానికి కాలానికి జరిగే సంఘర్షణలో ఎన్నిదారులు తెలిసినా, ఏ బాట సారికైనా.. కాలం చేర్చగలిగేదే గమ్యమవుతుందని "కాలం చేర్చ గలిగేది" కవిత ద్వారా వివరించారు.

పీపల్ బాయ్‌ను కర్తవ్య పాలకుడుగా అభివర్ణిస్తూ "ప్రభాత సేవ" కవితను తీర్చిదిద్దారు.

గురువులను ఉన్నతంగా ఆవిష్కరిస్తూ "అతనికి జోతలు" కవితకు రూపమిచ్చారు. నిల్లబల్లపై మల్లెలంటి అక్షరాలు.. మనోహరమైన పరిమళాలు అందిస్తాయని చెప్పడం బాగుంది.

కవి చక్రపాణిగారికి పల్లెలన్న మక్కువ అన్న సంగతిని తెలియజెబుతూ "పల్లెజాడ" కవితను రాశారు. పల్లె ధూళి సోకగానే.. జ్ఞాపకాలెన్నో ముసురుకుంటాయనీ.. ముందుకు సాగేకొద్దీ మనసున అద్దుకున్న మమతలెన్నో గుర్తుకొస్తాయన్న అర్థం ధ్వనించే విధంగా పల్లెతో తమకున్న బంధాన్ని, అనుబంధాన్ని అక్షరాల్లో ఆవిష్కృతం చేశారు.

పుస్తకాన్ని ప్రియనేస్తంగా భావిస్తూ.. పుస్తకం యొక్క ప్రాశస్త్యాన్ని తెలియజెబుతూ కవి చక్రపాణిగారు ఈ గ్రంథంలో "హితుడతడే", "భాగ్యశాలినౌతా" కవితల్ని పొందుపరిచారు.

నిన్ను నీ భావాలను పరిచయం చేసే ప్రారంభవాక్యమే నీ సత్తా ఏమిటో చెబుతుందంటూ "అల్లికలో.." కవితను రాశారు.

అనురాగాలు పంచుకోవడానికి రక్త సంబంధాలే ఉండనక్కరలేదనీ.. మంచి ఆశయం వెంట నడిస్తే చాలు.. కొత్త కొత్త దారులు పరిచయమవుతాయని.. ఆ దారిలో వచ్చిన అనుభూతులు చాలు.. వీడని బంధాలై స్థిరపడతాయంటూ "మన చుట్టాలు" కవితను తీర్చిదిద్దారు.

"చీరకట్టుదే భాగ్యం" కవితలో ఆమెలోని సొగసులన్నీ పొందికతో కుదురుకుని ఆడతనానికి ఆధారమై.. హుందాతనంతో గర్వంగా తోచే చీరకట్టుకు వందనం అంటూ కొనసాగించిన తీరు బాగుంది.

"నీ తోడుగా" కవితలో స్నేహం యొక్క గొప్పదనాన్ని, నవ్వుయొక్క ప్రాశస్త్యాన్ని "నవ్వుతూ తరిమేద్దాం" కవితలో, తెలుగు భాష ఔన్నత్యాన్ని "తెలుగు హారతి" కవితలో, శ్రావణమాసం ప్రాధాన్యతను "తొలిమెట్టు" కవితలో, నాన్న యొక్క గొప్పదనాన్ని "అంతరంగ దర్పణం" కవితలో కవి చక్రపాణి గారు తమదైన శైలిలో తమ భావాలను ప్రకటించారు.

మనసును విభిన్న కోణాల్లో ఆవిష్కరిస్తూ "మనసే వరమైతే" కవితను రూపుదిద్దారు. రెక్కలొస్తే మనసుకు రేయీ పగలు ఒకటేనని.. ఆశల ఆకాశంలో అలుపెరుగక విహరిస్తుందని పేర్కొన్నారు.

"మనో పరిమళం" కవితలోను కవి అందమైన ఆలోచనలకు చోటు కల్పించారు. మనసు తోటలో విరబూసిన పూలు.. వెదజల్లే పరిమళాలకు అవధి లేదనీ.. ఎంత దూరాలైనా పయనిస్తాయనీ.. ఎంత కాలమైనా తా జాగా ఉంటాయని చెప్పడం బాగుంది.

జ్వలించే కలం.. ప్రజ్వలించే అక్షరం అందించిన మహాప్రస్థానం.. ఓ మహా ప్రసాదమంటూ శ్రీశ్రీని నవయుగ కవితా స్ఫూర్తిగా "జ్వలించే కలం" కవితను రూపుదిద్దారు.

ఇలా ఎన్నో కవితలు ఈ సంపుటిలో ఉదహరించడానికి యోగ్యంగా ఉన్నాయి. సంక్లిష్టతకు తావివ్వకుండా సరళంగా.. మధుర భావాల కలశంగా "కలశం"గా తీర్చిదిద్దిన కవి డా॥ చక్రపాణి యిమ్మిడిశెట్టిగారిని అభినందిద్దాం.. ముస్ముందు మరింత గాఢమైన కవిత్వంతో మన ముందుకు వస్తారని ఆశిద్దాం..

- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

మణిపూసలు

-యన్.వి.రఘువీర్ ప్రతాప్
సెల్:9440551552.

మురిపాలు దాచుకునేవి
మనస్సులు దోచుకునేవి
ప్రేమలేఖలెన్నేన్నో

నయనాలు రాసుకునేవి!.
జీవితమొక చదరంగం
అడుగడుగున రణరంగం
మెదడుకు పదునిడితే
ఆడవచ్చు తారంగం!.

లెక్కకు క్యాలుకులేటర్
మిక్కిలైతె కమ్ ప్యూటర్
దేన్నైనా సృష్టించే
మేథస్సె అన్నిట బెటర్!

వయసులోని వ్యాపకాలు
ముదిమిలోన జ్ఞాపకాలు
మరుపన్నది రాకుంటే
జాలువారు మధురసాలు!

మోసంబును చేయవద్దు
మాయ మాటలాడవద్దు
చెడు తలపెన్నడైన
చేటన్నది మరవవద్దు.!

నేను అనే ఈ నేను
తనువును కానే కాను
పంచతత్వ మేనులోన
అవినాషి ఆత్మనేను!

మంచితనం కొందరిది
ముంచెతనం కొందరిది
ఎంచిచూడగ లోకాన
వంచెనే ముందున్నది!

వయసేమో పదారేళ్ళు
కోరికేమో పరవళ్ళు
మనసు కళ్లె మాపకుంటె
మిగులు నిడుముల కన్నీళ్ళు!

మధురగీతి వినిపిస్తూ
నా హృదయం దోచేస్తూ
కోయిలమ్మకూస్తుంది
పరవశాన ముంచేస్తూ!

కలలను కంటెనె మంచిది
బాధ మరిస్తెనె మంచిది
సుఖదు:ఖాల ఆటలో
తటస్థంగుంటె మంచిది!.

ఓడటమును కోరుకోము
ఎండమావి చేరలేము
బ్రతుకెంత భారమైన
ప్రయత్నమును మానుకోము!

శాశ్వతం కాదు కష్టం
నవ్వితే లేదు నష్టం
పరస్పర సాయానికి
ఇస్తె వచ్చేది స్పష్టం!

రైతుకాధారం పొలం
తోడు నిలుస్తుంది హలం
భవసాగరం దాటించి
బ్రతుకును వెల్గించు బలం!

జగతిన రాధాకృష్ణులు
ప్రేమకును ప్రతిరూపములు
స్వచ్ఛ చరితకు సాక్షిగ
నిలబడిన పాత్రదారులు!

రాళ్ళనేరవు హింసలు
సాద్వి కోరదు హింసలు
సద్గుణాల ధారణతో
సమసిపోవు సమస్యలు!

పెరుగుతుంది కాలుష్యం
చేయకుమా ఆలస్యం
మొక్కలు నాటి చెయ్యాలి
సమస్త పుడమిని సస్యం!

నాది నాది అనుకున్నది
కానెకాదెన్నడు నీది
శాశ్వతాన్కి చోటేది
సమస్తం మారుతున్నది!

కాలుష్యము హెచ్చెను
వ్యధలెన్నో తెచ్చెను
పర్యావరణం పాడై
ప్రాణ హాని వచ్చెను!

తృప్తికంటె సంపదేది?
మమతకు కొలమానమేది
అంతా మన మంచికైతె
అవమానముకు తావేది.

ఊసుపోని కబుర్లేంటి
ఉడికించెటి విసుర్లేంటి
వృధా అయ్యెకాలానికి
సమాధాన మివ్వవేంటి!

మళ్ళీ మళ్ళీ చదవాలనిపించే కథలు...

పుస్తక సమీక్ష

'రాధాగోపాలం కథలు' బాపూ రమణల 'అద్వితీయ' సృష్టి. ముళ్ళపూడి వెంకటరమణ రాసిన 1954 నుండి 1956 వరకు ప్రముఖ వారపత్రికలో ప్రచురింపబడిన 4 కథలు ఈ సంపుటిలో ఉన్నాయి. కథలకు ఒకటీ ఆరా, చిత్రాలు వేయించటం పత్రికల ఆనవాయితీ. ఆ ఆనవాయితీకి భిన్నం గా, మధ్యలో బాపూగారి బొమ్మలు అందునా రాధ, గోపాలం లాంటి అందమైన యువతీ, యువకుల బొమ్మ లున్నాయి. కథ-కథకు వేసిన బొమ్మలు. ఒకదానితో మరొకటి పోటీపడుతూ, యువ హృదయాలను గిలిగింతలు పెడతాయి. యువతే కాదు. వయసు దాటిపోయిన వారికి తమ వయసులోని మధురానుభవాలను గుర్తుకుచేస్తూ, గిలిగింతలు పెడ తాయి. నాలుగు కథల్లోనూ 'కామన్'గా రాధ, గోపాలం అనబడే యువ జంట ఉంటుంది. కథను రక్తి కట్టించేందుకు సింగినాథం ప్రేమనాథం, జి.వి.మూర్తి లుంటారు. బొలెడంత హాస్యంపంచటానికి దొడ్డమ్మగారలు, బుచ్చికక్కిగారలుంటారు. తుకారాం అనే అప్పులు దండుకునే అప్పారావులుంటారు. చిన్న చిన్న అలకలు, మూతి మూడుచుకోవటాలు ఆపైన పశ్చాత్తాపాలు, కోపాలు తాపాలు అనంతరం మళ్లీ కలుసుకోవటం లోని మాధుర్యం మనకు చూపుతారు రమణగారు. కథలు ఆసాంతమూ, పాఠకుడి హృదయా లను గిలిగింతలు పెట్టే సన్నివేశాలు సంభాషణలుంటాయి. లహరి కథలో రాధా గోపాలం అనే యువజంట రైలు ప్రయాణం చేస్తుంటారు. నిద్రపోతోన్న రాధ గోపాలం కళ్ళకు అలసిపోయిన అప్సరసలా కనిపించింది. రాధ వేణీభారం ఆ మనసు విసికన్న దీపపు మసికన్న నల్లగా ఉందిట. దేవుడికెలాగై నా మంచి ఈస్టటిక్స్ సెన్సు ఉంది అనుకున్నాడట గోపాలం. కథ చదువుతున్న మనమూ అనుకుంటాము రమణగారి క్కూడా కథలో పదాలు పొదగటంలో గొప్ప ఈస్టటిక్ సెన్సు ఉంది' అని. వీళ్ళిద్దరికీ సృష్టించిన బ్రహ్మ సరస్వతులను కూడా కథలోకి లాగుతారు రమణ సన్నివేశాల్ని రక్తి కట్టించే రమణ మార్కు వర్ణనలు "గాలిజోరుగా వీచింది. చెట్టు మీద ఆకుల్లో అణిగి వున్న నీటి చినుకులు టపటపరా లాయి. ఒక బిందు రాధ నుదుటి మీద నిలిచింది. ఆ నీటి బొట్టు వెన్నెల కాంతిలో తళుక్కున న మేరిసింది. రాధ ఒక మారు జలదరించింది' (పే.16).



ప్రతులకు:
అక్షజ్ఞ పబ్లికేషన్స్
సికింద్రాబాద్
సెల్: 8341450673

'రాధమ్మ బాకీ' టైటిల్ చదవగానే పెళ్ళాం మొగల మధ్య ఈ బాకీ లేమిటి అని హాచ్చర్యపడతాము. పెళ్ళి చూపుల శుభదినం నుండి పెళ్ళి వరకు రాధకు రాసిన ఉత్తరాల ఖర్చు! రాధ ఏం తక్కువ తిందా! పెళ్ళికాక ముందు గోపాలానికి ఇష్టమనీ కొన్న జార్జెట్ చీర, కాళ్ళకు పట్టాలు, నాగరం- వీటన్నింటికీ, గోపాలం బాకీపోను డెబ్బయి రూపాయలు రాధకు బాకీ తేలాడు. గోపాలం ఇచ్చాడా? లేదా?? అన్నది పాఠకులు కథ చదివితేనే తెలుస్తుంది. "కుమార సంభవమ్" కథలో గోపాలం బామ్మకి సుబ్బలక్ష్మి అనే పొరుగింటి పిల్ల బామ్మకి ఓ రోజు మాటా మాటా వచ్చింది. వారిలో ముని మనవడినని ఎవరు ఎత్తుకుంటారని. గోపాలం బామ్మ గెలిచిందా? సుబ్బలక్ష్మి బామ్మగెలిచిందా? పాఠకుడుకే కథ చదివితేనే తెలుస్తుంది.

చదివి నాలుక్కాలాల పాటు దాచుకుని మళ్ళీ మళ్ళీ చదివి ఆనందించదగ్గ కథలు ఇవి. ఇంటింటా తప్పక ఉండదగ్గ కథ సంపుటి.



-కూర చిదంబరం
సెల్: 8639338675

అందరూ దూరం జరిగారు, మరి నా దగ్గరకు వచ్చిందెవరు ?

దారి వెదుకుతూ
దూరం తెలియక అలసి పోయాను
నిర్మానుష్యంలో కొంతసేపు
ఒంటరిగా నిద్రపోయాను.

ఎవరూ లేని కాలంలో
ఎంతో దయగా
నా గుండె మీద పడిన
మృదువైన, ఈ చేయి ఎవరిదీ !?

మనుషుల్ని మనుషులే,
మరిచి పోయారు కదా !
ఇప్పుడు నేను ఎవరికి గుర్తొచ్చాను ?!

చలో,
ఊపిరి పోసుకోవ డానికి -
గాలి స్పర్శ నైనా దొరికింది !

గమ్యం చేరేదాకా
వేలు పట్టుకొని నడవడానికి
ఒక నమ్మకంలాంటి, ఊహా మిగిలింది !

-ఆశారాజు
9392302245

వారాల పేటలు (పాట)

పల్లవి:
వాడ వాడల వెలిగే..
నా నిర్మల...
ఏడు వారాల హారమై..
విలసిల్లెరా!.
వాడ వాడకు నేడు
నా నిర్మల..

వారముల పేటగా పేరొందెరా!

చరణం:
రవివార్ పేటయై వెలిగే..
ఆదివారమే తోడ.

సోమవార్ పేట గా శోభిల్లే..
సోమవారమే కడు..సొగసై

బంగల్ పేట్
(నాడు మంగళ్ పేట్)గా వర్ధిల్లే
మంగళవారమే శుభమంగళమై

బుధవార్ పేట్ గా బాసిల్లే..,
బుధవారమే..స్వర్ణశోభితమై.

చరణం:
బెస్తవార్ పేట (గురువారం)
గా భవ్యమై..నడయాడే..
గురువారమే..నానాటికీ నవ్యమై!

జుమరత్ పేట
(జుమ్మ అంటే శుక్రవారం)గా ఫరిడవిల్లే.
శుక్రవారమే..శుభదినమై.

శనివార్ పేట గా సుగమమై సాగే
శనివారమే..శుభమస్తు సంకేత స్వరమై

-టి.కిరణ్మయి
9441711652

పిలుపు

ఏదో ఆత్మీయ పిలుపు
మనసుకు దగ్గరగా
మదిలో సుతిమెత్తని
భావాల బీజాలు వేస్తూ.

తెలియని జ్ఞాపకాల వీధుల్లో
చల్లని స్పర్శగా తాకి
నన్ను తీసుకెళుతూ.....
కాలాన్ని మరిచి
నాతో కవాతు చేస్తూ
సుదూర పయనాన్ని
క్షణక్షణం గా మారుస్తూ..

అక్కడంతా.. అక్కడంతా..
ఆలోచనలను ఆలోచనలతో
పంచుకుంటున్నారు.
అదొక స్వేచ్ఛా ప్రపంచం.

వయస్సుల్ని మరిచిన
చైతన్య ప్రదేశం
వివేక కేంద్రం.

అది
స్వార్థాల
కుబుసం
వీడిన మనసు రాజ్యం .

అది
కోమల మృదు మధుర
స్వరనాద సంగీత స్వేచ్ఛా నిలయం.

అక్కడ చైతన్యాన్ని
ఒంటినిండా పూసుకుంటున్నారు.

తాగే సుధా నీటిలో
ఆస్వాదించే ఆ చల్లని గాలిలో
ఆనందం
నిండిన ఆ మేనులోని
ప్రతి కంటిలో.. చైతన్యం.

చైతన్య కేతనాలయి
కొమ్ములు
ఊపిరి పోస్తున్నాయక్కడ.

స్వార్థ మబ్బుల్ని చీల్చుకుంటూ
న్యాయపు చంద్రుడు
ప్రేమ వెన్నెలను కురిపిస్తున్నాడక్కడ.

బాధల గొడుగులు పక్కన పెట్టి
బాధ్యతగా వెన్నెల్లో
మేనులు తడిసి ముద్దవుతున్నాయి
ఆశలు ఆశయాలు
జీవం పోసుకుంటున్నా యక్కడ.

అక్కడ
బంధాలు అనుబంధాలు
పూచిన పూల సౌరభాలవుతున్నాయి.

రా మిత్రమా.... నువ్వూ. రా ...
ఆ పిలుపు నీకూ వినిపిస్తున్నది కదూ..
ఆ సౌరభాలు నీకూ.. ఇంపే కదూ...
వీచే ఆ చల్లని చైతన్య గాలిని
కలిసి ఆస్వాదిద్దాం
రా ....మిత్రమా... నువ్వు రా.....

-సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

పెద్దబాలశిక్ష!

అమూల్యమైన జ్ఞానానికి
అనంతమైన విజ్ఞానానికి
ఆధునికమైన పరిజ్ఞానానికి
అక్షయమైన దివ్యజ్ఞానానికి గ్రంథాలున్నట్లే..
కుట్ర , మోసం, వంచన
నమ్మకద్రోహమనే రుగ్మతలకు సాహిత్యంలో
కల్పానిక కథలు, సినిమాలు,
నవలలు , నాటకాలు కోకొల్లలు !
కాని , మనుషుల లోపలి మర్మాలు చదివే
విచక్షణా వివేకానికి, విషయ వివేచనకు,
అర్థంకాని అనుభవాలకు,
అవసరమైన సర్దుబాట్లకు,
ప్రత్యేక లైబ్రరీలు , డిక్షనరీలు
లేబరేటరీ సదుపాయాలు ఉండవెక్కడ !
అందుకే , ప్రపంచంలో
సకల మనస్తత్వాలకు
విశ్వగురువైన సమాజమే
ఒక పెద్ద బాలశిక్ష !
నిరంతర పరిశీలనే
సహజమైన జ్ఞానదీక్ష !
పరిణతున్న లోకజ్ఞానమే
విజ్ఞాన సర్వస్వం !
కనిపెట్టుకొని కలియ తిరిగేటోడే
కోవిదుడు !
కాదని బాటదప్పినోడవడైనా
కాటగలుసుడే !

- డా॥ డి. రాజేష్
9440460490

'అక్షర లహరి' కవితా సంపుటి ఆవిష్కరణ



'అక్షర లహరి' కవితా సంపుటి ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్. వేదికపై సుతారపు వెంకట నారాయణ, రఘువీర్ ప్రతాప్, బిక్కి కృష్ణ, డా॥ నాళేశ్వరం శంకరం తదితరులు.

హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో తెలంగాణ కవుల సంఘం అధ్వర్యంలో ప్రముఖకవి బిక్కి క్రిష్ణ అధ్యక్షతన సుతారపు వెంకట నారాయణ రచించిన కవితా సంపుటి పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఘణంగా నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా ప్రముఖ సాహితీవేత్త కొలకలూరి ఇనాక్ పుస్తక ఆవిష్కణ చేశారు.

ఈ సందర్భంగా ఇనాక్ గారు ఉపన్యసిస్తూ సుతారపు వెంకట నారాయణ రచించిన అక్షర లహరి కవితా సంపుటిలోని ప్రతి కవిత ప్రత్యేకలక్షణాలతో కొనసాగుతూ సమాజంలోని వివిధ విషయాల్ని వివిధ కోణాలలో వివరించబడినాయన్నారు. సమాజంలోని అనేక విషయాల్ని అవగాహన చేసుకుంటూ రచనలు చేస్తేనే కవుల రచనలకు నిజమైన సార్థకత లభిస్తుందని అలాంటి రచనలు సుతారపు వెంకట నారాయణ చేయడం అభినందనీయమన్నారు . గౌరవ అతిథిగా నాళేశ్వరం శంకరం ఉపన్యసిస్తూ సుతారపు కవితలు తెలంగాణ ప్రాంత విశిష్టతల్ని సంస్కృతి సంప్ర

త్వరలో ఆవిష్కరణ కానున్న డా॥ పి. విజయలక్ష్మి పండిట్ సమగ్ర కవిత్వంపై ప్రముఖ కవి విమర్శకులు గుడిపాటి రాసిన ముందుమాట.

విశ్వపుత్రిక కవిత్వం ఉత్సవ సౌరభం

ప్రకృతిని పరిశీలించడం, మనుషులని ప్రేమించడం, లోకాన్ని కరుణతో చూడటం, సాహిత్యంతో నిరంతరం చరించడం డా. పి.విజయలక్ష్మిపండిట్ గారి జీవితంలో అంతర్భాగం. స్పందించడం, తన స్పందనలకు అక్షరరూపం ఇవ్వకుండా ఉండలేకపోవడం ఆమె సాహితీ మూర్తిమత్వంలోని విలక్షణత. నిత్యమూ నిరంతరమూ తన అక్షరాలతో సృజనభూమిని సుసంపన్నం చేయడం ఆమె విశిష్టత. దాదాపు అయిదు దశాబ్దాల ఆమె సాహిత్య ప్రయాణంలో మేలిమలుపులు అనేకం. అభివ్యక్తిలో వైవిధ్యం అపారం. విభిన్న ప్రక్రియలతో కూడినది ఆమె సారస్వతం. కథలు, వ్యాసాలు, అనువాదాలు ఎన్ని చేసినా కవిత్వం మీద మమకారం మరింత ప్రత్యేకం. కవితా రూపాల్లో చేసిన ప్రయోగాలు అపురూపం.

వచన కవిత్వం రాయడానికి మాత్రమే పరిమితం కాలేదు డా. విజయలక్ష్మి పండిట్. అనువాదాలు చేశారు. మరీ ముఖ్యంగా రవీంద్రనాథ్ టాగోర్ 'గీతాంజలి'ని 'అపూర్వ గానం' శీర్షికన అనువదించి సాహిత్య ప్రేమికుల, విమర్శకుల ప్రశంసలు పొందారు. దీర్ఘకవితలు సృజించారు. సున్నితమైన అభివ్యక్తితో హైకూలు రచించారు. గజల్ ప్రక్రియను చేపట్టి మూడు పుస్తకాలు వెలువరించారు. గజళ్ళు రాసే వారిని ప్రోత్సహించేందుకు చేయూతనిచ్చారు.

ఆమె జీవితంలోని వైశాల్యమే ఆమె కవితా ప్రపంచాన్ని విశాలం చేసింది. అసంకల్పితంగానే కవిత్వంలో తన లోలోపలి భావనా ప్రపంచాన్ని అనేక కోణాల్లోంచి ఆవిష్కరించారు. కాలం గడుస్తున్నకొద్దీ వస్తు శిల్పాల నిర్వహణలో చిక్కదనాన్ని సాధించారు. కవిత్వంలో గాఢత, సాంద్రతకు ప్రాధాన్యం ఇచ్చారు. ఎంచుకున్న వస్తువును సౌందర్యాత్మకమైన రీతిన వ్యక్తం చేయడం డా.విజయలక్ష్మి పండిట్‌లోని సుగుణం. దాదాపు ఎనిమిది పుస్తకాల కవిత్వాన్ని సమగ్ర సంకలనంగా తీసుకురావడం ముదావహం. ఇది కవిత్వ ప్రేమికులకు ప్రత్యేక కానుక.

ఒకే వాచకంలో వచన కవిత, దీర్ఘకవిత, హైకూలు ఉండటం వైరుధ్యం కాదు పాఠకుల్ని మిశ్రమానుభూతులకు లోను చేసే వైవిధ్యం. కవిత్వ ప్రేమికులకు ఉత్సవ సౌరభం. ఈ సంకలనపు వైశిష్ట్యానికి సంకేతం. విజయలక్ష్మి పండిట్ గారి కవిత్వంతో కొన్నాళ్ళుగా ప్రయాణిస్తున్నాను. అనేకసార్లు చదివాను. చదివిన ప్రతిసారి కొత్తదనంతో కూడిన భావస్ఫూర్తి మనసును ముప్పిరిగొంటుంది. తన దృష్టిపథంలోకి వచ్చిన అనేకానేక అంశాల్ని తన కవితాక్షరాలతో సత్కరించారామె. మానవ స్వభావంలోని వైరుధ్యాల్ని, మనుషుల్లోని విభిన్న నైజాల్ని, పరిస్థితుల ప్రాబల్యంలో పడికొట్టుకుపోయే వారి సంవేదనల్ని కవితామయం చేస్తూ వచ్చారు.

ప్రకృతిని జయించానని గర్వించే మనుషులు తమని తాము తెలుసుకోలేని దురవస్థని పదునుగా చెప్పారు.

"విశ్వాంతరాళంలో
సౌర కుటుంబమొక శకలమని
భూమి గుండ్రమని
భూమ్యాకర్షణశక్తి వల్లే
జీవరాశులన్నీ భూమినంటి పెట్టుకున్నాయని
నిరూపించాడు మానవుడు"
కానీ –
"విశ్వాంతరాళాన్ని ఛేదిస్తూ
అన్వేషిస్తున్న మానవ మేధస్సు
తన అంతరంగంలోకి తొంగి చూడదేం?
ఆత్మశోధన చేసుకోదేం?
తన గమ్యమేమో లక్ష్యమేమో
తెలుసుకోదేం?" అని ప్రశ్నిస్తున్నారు.

ఎందుకంటే విశ్వాన్ని జయించడం కన్నా సాటి మనుషుల మేలు తలపోయడం ముఖ్యం. మానవత్వంతో పరిమళించడం ప్రధానం. కానీ తన స్వార్థం కోసం ప్రకృతిలోని గాలినీ, నీటినీ, నేలనీ సైతం ఛిద్రం చేయడం ప్రశ్నార్థకం. ఈ నేపథ్యంలోనే 'కదలికెందుకొచ్చింది కోపం?' అంటూ 'సునామీ'లతో చేలరేగిన అల్లకల్లోలాలకు, మానవుని స్వార్థానికీ, ప్రకృతి విధ్వంసానికీ గల సంబంధాన్ని గుర్తు చేస్తారు.

"మంచి గాలి, తిండి. గుడ్డ, నీడనిచ్చి
మిమ్మల్ని కాపాడే పచ్చని చెట్లను నరకవద్దని
ఓజోను పొరుకు చిచ్చు పెట్టవద్దనే" 'భూమి తల్లి ఆవేదన'ను అక్షరీకరిస్తారు. అడవులు, నదులు, సముద్రాలు, చెట్లు, ఇంద్రధనుస్సులు... ఇవన్నీ ఎంత సహజంగా ఉన్నాయో మానవులు కూడా అంతే సహజంగా 'నిలువెత్తు వ్యక్తిత్వాల'తో మసలుకోవాలన్న ఆకాంక్షను వ్యక్తం చేస్తారు ఈ కవయిత్రి. కనుక ప్రకృతిని అనుసరిస్తూ, మానవ విలువలను శిరోధార్యంగా భావించాలనే ఈ కవయిత్రి

"నీతి నిజాయితి లేని
జీవితమంటే నాకు సరిపడదు" అని విస్పష్టంగా చెబుతారు

"కుటుంబ, సంఘ, దేశ భవిత
దేశ గౌరవాన్ని నిండుగా మెండుగా
పదికాలాల పాటు నిలిపేది
మొక్కవోని నిలువెత్తు వ్యక్తిత్వాలే" అని చాటుతారు.

"స్ఫటికంలా పారదర్శకమయిన
ఈ ముక్కుసూటి వ్యక్తిత్వాలు
కొంతమందికి నచ్చకపోయినా
నిలుపుతాయి నిలువనీడ లేకుండా పోతున్న
నీతి నిజాయితీలను పది కాలాలు" అన్న వారి మాటలు నికార్సయిన సత్యాలు. మానవత్వానికి చిరునామాగా నిలిచే అలంకారాలు. విలువల మీద నిలబడిన వ్యక్తులే ఈ ప్రపంచానికి నిజమైన చోదకశక్తులని చెప్పడం విజయలక్ష్మి గారి కవిత్వంలోని అంతస్సారం.

×××

మానవాళిలో సగభాగం మహిళలు. ఈ సగభాగాన్ని అమానవీయంగా చూడటం పట్ల ఆగ్రహంతో కూడిన అభివ్యక్తి విజయలక్ష్మి పండిట్ కవిత్వంలో చూస్తాం. ప్రత్యేకించి ఆకాశంలో 'అర్ధభాగం' కవిత్వానికి మహిళ జీవితమే భూమిక.

"అమ్మ కడుపులో బిడ్డ ఆడనలుసుకు
అమ్మ కడుపులోనే సమాధి కట్టేస్తూంటే
కనుమరుగైపోతున్న ఆడవారి సంఖ్య
కలవరపెట్టేస్తూంది" అంటూ సమాజంలో పాతుకుపోయిన వివక్ష ఎలాంటి విపరిణామానికి దారితీస్తుందో చెబుతారు. "'భూమిపై మనిషి జాతి మనుగడే ప్రశ్నార్థకమయ్యే రోజులొచ్చే" ప్రమాదాన్ని గురించి హెచ్చరిస్తారు. చదువుల్లోనూ వివక్ష, బాల్యంలోనే పెళ్ళి చేసి ఉరితాళ్ళను బిగించే కుట్ర, ఆంక్షల కత్తెరలో 'బోన్సాయ్ బ్రతుకు' అయిపోయిన స్త్రీ జీవనాన్ని దృశ్యమానం చేస్తారు. ఇదే వరుసలో మహిళ బతుకులోని అగచాట్లను, ఆధునికత తెచ్చిపెట్టిన విపత్తుల్లో అతలాకుతలమయ్యే జీవితాలను వస్తువులుగా చేసుకొని అనేక కవితలని సృజించారు. 'సరోగేట్ మదర్'లోని అంతర్వేదన, మానవ మృగాల తృష్ణకు బలయ్యే పసిమొగ్గల దైన్యం, మూఢనమ్మకాల చట్రంలో 'జోగిని' దురాచారాలకు బలయ్యే ఆడవాళ్ళ బతుకు చిత్రం, 'కంచే చేను మేస్తే' అన్న రీతిన 'కనుపాపలా కాపాడుకోవాల్సిన / కన్నతండ్రి కూతురిని కాటేసే' దుర్మార్గం, 'ప్రపంచీకరణ'లో 'విశృంఖల విదేశీ సంస్కృతుల వెల్లువలో 'అన్‌సర్టెనిటీ'లోకి నెట్టబడుతున్న ఆడపిల్లల వెతల దృశ్యాలెన్నో ఈ కవిత్వంలో దర్శనమిచ్చి పాఠకుల్ని విచలితుల్ని చేస్తాయి.

'నేనూ మనిషినే' అని తనను మనిషిగా గుర్తించి మసలుకోమనే మహిళ మనోభావాల పరంపరని ఓ దీర్ఘకవితలో ఎంతో ఆర్ద్రంగా చిత్రించారు. ఆడవాళ్ళను ఆడవాళ్ళే తక్కువగా చూసే సందర్భాల్ని సృష్టించిన పురుషా ధిక్య సమాజ దుర్నీతిని తూర్పారా బడతారు. వివక్షనుంచి విముక్తమయ్యే దిశగా చైతన్యం సంతరించుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతారు. సరళంగా సాగిపోయే ఈ కవితలో ఆడవారి జీవితంలోని భిన్నకోణాలను, అనాదిగా ఇంటా బయటా నెలకొన్న దుర్మార్గమైన వివక్షను కళ్ళకు కట్టేలా చూపిన తీరు పాఠక హృదయాలని ద్రవీభూతం చేస్తుంది. ఈ వివక్షల ఫలితమే స్త్రీవాదం నెలకొన్నది. అయినప్పటికీ 'స్త్రీవాదం' అంటే ఏమిటో తనదైన నిర్వచనం చెప్పారు. **"స్త్రీ ఒక మనిషేనని ఆమెకు మనసుందని తెలిపేది స్త్రీవాదం/ స్త్రీకి విద్య, వైద్యం, స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యం కనీసావసరాలని చాటి చెప్పే వాదం స్త్రీవాదం"** అంటూ స్త్రీవాద ప్రత్యేకతని తెలియజేసారు. స్త్రీలు లేకుండా పురుషులు లేరు. ప్రపంచమే లేదు. కనుకనే **"ఓ.. ఏడమ్"** అనే కవితలో –

"సృష్టిలో ఆడమగ 'అర్ధనారీశ్వరతత్వం'
ఒకటి లేకుంటే ఇంకోదానికి మనుగడ లేదు
ఎడమ్... నా (స్త్రీ) ప్రగతికి నీవు అడ్డుపడితే
నీ ప్రగతికి నీవు అడ్డు పడినట్లే" అనే సత్యాన్ని గ్రహించమని మగ ప్రపంచానికి హితబోధ చేస్తారు. ఈవిధంగా స్త్రీ జాతి అస్తిత్వాన్ని, ఔన్నత్యాన్ని బలంగా చెప్పడం డా. విజయలక్ష్మి పండిట్ కంఠస్వరంలోని ప్రత్యేకత.

×××

కవిత్వం విజయలక్ష్మి గారి ఆత్మకళ. ఆమె హృదయావిష్కరణకు ఉపకరణం. తన లోపలి ప్రపంచాల ఆవిష్కరణకు ఎంచుకున్న సాధనం. అనంత కాలచక్ర గమనంలో 'కాలచక్రబాట సారులు'గా పయనించేవారి నిరంతరయాత్రలోని దృశ్యాలను వ్యక్తీకరించే కళ ఆమె కవిత్వం.

"నా జీవితానికి జీవం పోసే ఆత్మశక్తి కవిత
కవిత్వం కాని జీవితం నాకు ఎడారి సదృశం
కవిత నాకు... సృజనాత్మక జీవితాన్నిస్తూ నన్ను నడిపిస్తూంది..
అందుకే... నా జీవితమే ఒక కవిత్వం
కవిత్వమే నా జీవితం" అని తన జీవనగమనానికి చోదకశక్తిగా నిలిచిన కవిత్వం వైశిష్ట్యాన్ని లలిత లలితంగా చెప్పడం ముదావహం. తన కవిత్వానికి ప్రేరణనీ, ఉత్తేజాన్నీ, దీప్తినీ ఇచ్చే తీరును అనేక కవితల్లో ప్రస్తావించారు.

"ఆడపిల్లల అగచాట్లు విని
అశాంతితో నిస్సహాయంగా కాగితంపై కలమాన్చాను
నా చేతి కలం కన్నీరు కార్చింది
...
అక్షర రూపం దాల్చని నా నిష్కల్మష నిజాయితి అనుభూతి
కన్నీటి బిందువులలొలికిన కవితా చిత్రమయింది" (నా కలం కన్నీరు కార్చింది) అంటారు. ఈవిధంగా తన హృదయ స్పందనకు ప్రేరణయ్యే సందర్భాల్ని ప్రస్తావించారు. ఆ ప్రస్తావనలు ఇక్కడ చూడండి –

కవిత రాయడం అంత సులువేం కాదు. **"తొమ్మిది నెలలు గర్భంలో మోసి/ తల్లి నొప్పులు భరించి/ బిడ్డకు జన్మనిచ్చినట్లే/ కవితా శిశువును కనడం కూడా!"** (కవితా శిశువు)

"నా ఊపిరిలా/ కవిత స్వేచ్ఛా విహారిణి
నా భావావేశాల/ ఆలోచనా విహంగాల రెక్కలపై కూర్చుని
విహరిస్తూ... అలవోకగా అనువదిస్తుంది
నా భావాలను కవితలుగా..." అనడం ద్వారా కవితాసృజన తనకు ఊపిరి పీల్చడంతో సమానమని వ్యక్తీకరిస్తారు. కవిత్వంపై డా.విజయలక్ష్మి పండిట్‌కు గల ప్రేమకు, నిబద్ధతకు ఇది సంకేతం. ఈ నిబద్ధతని సంతరించుకోడానికి తగిన పునాదులు ఆమె బాల్యంలోనే పడ్డాయి. 'మా వూరి గ్రంథాలయం' శీర్షికన రాసిన కవిత ఇందుకు తార్కాణం. తను చిన్నతనంలోనే అధ్యయనశీలిగా రూపొందడానికి కారణమైన తమ వూరి గ్రంథాలయాన్ని ఈ కవితలో సాక్షాత్కారింపజేశారు.

'నా ఆత్మకళల'కు కొనసాగింపు 'నా అక్షరాలు' అంటూ విజయలక్ష్మి పండిట్‌గారు రాసిన కవితలు ఆమె కవిత్వంలోని వస్తు వైశాల్యాన్ని, అభివ్యక్తిలోని వైవిధ్యాన్ని చెబుతాయి. అక్షరాల్లో నిక్షిప్తమైన మానవ జీవితచరితని 'అక్షర మానవుణ్ణి' కవితలో రూపుగట్టించారు. తన అక్షరాల విశిష్టతని 'నా అక్షరాలు' కవితలో మృదువైన భావచిత్రాలతో కళ్ళముందు నిలిపారు.

"నా అక్షరాలు... ప్రభాత వేళ అలలై తేలివచ్చే గుడి గంటలు
నాన్న దాచి ఇచ్చే ప్రేమ పలుకుల తాయిలాలు
అనురాగమయి అమ్మ ప్రేమ చేతిముద్దలు" అంటూ దైవాన్ని, ప్రత్యక్షదైవాల్ని అక్షరాలతో అభిషేకించారు.

"అనంత చైతన్య తరంగాల అక్షరరూపాన్ని
లక్షలసహస్రాక్షర హిరణ్య కమలాన్ని
నేను తెంపులేని అనంత వాక్యాన్ని
నేను నీ కలను, నీ కలతను, నీ కవితను...?!" అంటూ అక్షరాల శక్తిని తెలియజేస్తారు. సాహిత్యానికి, చరిత్రకు, జీవన సంస్కారానికి అక్షరరూపం ధరించిన కథలు, కవితలు ఏవిధంగా దోహదం చేస్తున్నాయో ప్రతీకాత్మకంగా చెప్పడం ఆకర్షిస్తుంది. బరువైన బాల్యపు వెతలు, రైతు ఆత్మనివేదన, తెలుగు భాష దీనాలాపన, పక్షుల ఆకలిపాటలు, అలసిన దేహాల ఆలాపన భావతరంగాలుగా వెల్లువెత్తిన కవితలు విజయలక్ష్మిగారి కవితాశక్తికి దర్పణాలుగా నిలుస్తాయి. తనని కదిలించిన సంఘటనలను చక్కని ఊహాశాలితతో అభివ్యక్తం చేసిన తీరు అబ్బురపరుస్తుంది.

×××

భిన్న సామాజిక చట్రాలలో బిగుసుకుపోయిన మానవ జీవన సంవేదనలని ఎంతో ఆర్తితో వ్యక్తీకరిస్తూ పాఠకుల్లో 'ఏకత్వ జ్ఞాన జ్యోతిని" వెలిగిస్తారు విజయలక్ష్మిపండిట్ గారు. ప్రకృతికీ, మానవుడి జీవనరీతికీ గల సంబంధాన్ని ఆధ్యాత్మిక కోణంలోంచి ఆకళింపు చేసుకునే దృష్టిని ప్రసాదించడమే 'ఏకత్వ జ్ఞానం' కవిత్వం. సాంద్రమైన, గాఢతమమైన కవితలెన్నో పాఠకుల్ని మేల్కొల్పుతాయి.

"భూమిపై జీవులంతా మనుషులైనా మృగాలైనా
పెద్దవైనా చిన్నవైనా ధనికులైనా పేదలైనా
జీవిత ఉద్వేగాలు ఒక్కటే
ఎందుకంటే...
భూమిపై ఆశ్రయించిన ప్రాణులన్నీ..
ఆ విశ్వాత్మ నుండి విడివడి జన్మనెత్తిన చిన్ని చిన్ని ఆత్మలు"

'సహబాటసారులు' అనే కవితలో సిసలైన జీవితసత్యాన్ని చెప్పిన తీరు ఓ కనువిప్పు. ప్రకృతిలో మానవులే గాక జీవజాలం ఎంతో వుంది. వాటిని ఎలా చూడాలో, వాటి మనుగడకు ఆటంకం కలిగించకుండా మనుగడ సాగించడమెలానో ఈ కవిత ద్వారా చెప్పారు విజయలక్ష్మిపండిట్‌గారు. ఇతర ప్రాణులను, చెట్లను, పుట్లను పదిలంగా కాపాడుకోవాలన్న సూచన వుంది కవితలో. ఈ దృక్పథకోణం నుంచి అనేక కవితలు రాసి పాఠకుల్లో హృదయ సంస్కారం పాదుకోవాలన్న ఆకాంక్షని వ్యక్తం చేసారు. పిచుకలు కనుమరుగవుతున్న స్థితిని ఆర్ద్రంగా చెబుతూ వాటిని కాపాడుకోవలసిన అవసరాన్ని గుర్తు చేస్తారు. మొక్కలను, పక్షులను, నదులను, జ్ఞాపకాలను, స్నేహాలను, ప్రేమలను కాపాడుకునే సున్నిత మనస్కులై మసలుకోడంలోనే మానవ జీవితానికి సార్థకత ఉందనే సందేశం ఇస్తుందీ కవిత్వం.

×××

నాగరికత పేరిట, అభివృద్ధి పేరిట పర్యావరణ విధ్వంసాన్ని చేసే తీరుపై ధర్మాగ్రహాన్ని వ్యక్తం చేస్తారు 'ధరిత్రీ విలాపం'లో. ఆర్థికాభివృద్ధి పేరిట అరణ్యాల్ని కొల్లగొట్టడం, గుట్టల్ని, కొండల్ని కరిగించడం, నదుల్ని కలుషితం చేయడం, సముద్రాల్ని చెరబట్టడం, పర్వతాలను తొలిచేయడం, గగనానికి తూట్లు పొడవటం దారుణం. పంచభూతాలను తన గుప్పిట్లో పెట్టుకొని ఆడించే మానవ స్వార్థాన్ని, వ్యాపార దుర్మార్గాల్ని నిలదీసే దీర్ఘకవిత 'ధరిత్రీ విలాపం'. వేల సంవత్సరాల కాలం నుంచి మానవ శ్రేయస్సుకీ, సకల జీవకోటి క్షేమానికి తోడ్పడిన ఇలాతలాన్ని ధ్వంసం చేసే వేగం ఈ వందేళ్ళలో పెరిగింది. ఫలితంగా అతివృష్టి, అనావృష్టి, పెనుతుఫానులు, సునామీలు, భూకంపాలు సంభవిస్తున్నాయి. ఈ వాస్తవం తెలిసినప్పటికీ అభివృద్ధి రథాలు ఆగడం లేదు. ఫలితంగా వర్తమానమే కాదు భవిష్యత్తు అంధకార బంధురమై రానున్న తరాలు ఈనేల మీద నివసించే లేని పరిస్థితి నెలకొంటున్నది. ఈ దుస్థితిపై డా. విజయలక్ష్మి పండిట్ అంతరంగ మథనానికి అక్షరరూపం 'ధరిత్రీ విలాపం'.

"నాలోని స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారాన్ని
కలుషితాలతో నింపి మీ జీవితాల్ని విషమయం చేస్తున్నాయి
ఎవరు రక్షించాలి మిమ్మల్ని" అంటూ ధరణీమాత మానవాళిని నిలదీస్తుంది. భూమాత తన స్వగతంలో మానవుణ్ణి ప్రశ్నిస్తున్న రీతిన సాగిన ఈ కవిత పాఠక హృదయాలను కదిలిస్తుంది. ప్రకృతి సమ్మతంగా జీవించాల్సిన అవసరాన్ని ప్రబోధిస్తుంది. ఇకనైనా ప్రకృతి ధ్వంసం ఆపాలని చెబుతుంది.

"వనదేవత ఒడిలో సేదదీరిన ఋషి సంస్కృతిని
సరళ జీవన విధానాన్ని పునరుద్ధరించి
పర్యావరణ స్నేహ జీవనశైలికి నాంది పలుకు
'పర్యావరణాన్ని పరిరక్షించు' లేదా 'పతనం చెందు'
అనే ఈ ద్వంద్వ నినాదాల్లో
విచక్షణతో విలక్షణ నిర్ణయం నీదే! నీదే!" అని మానవుల్ని మేల్కొల్పడం ఈ 'ధరణీ విలాపం'లోని సారాంశం. ఆద్యంతం ఆర్ద్రంగా చదివించే దీర్ఘకావ్యమిది. దీనిని పాఠశాల, కళాశాల విద్యార్థులకు పాఠ్యాంశంగా పెట్టడం ఎంతో ఉపయుక్తం.

×××

వసుధైక కుటుంబ భావన భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలోని గొప్పతనం. మానవాళి మాత్రమే కాదు సకల జీవకోటి, సమస్త విశ్వం శాంతి సౌఖ్యాలతో పరిఢవిల్లాలన్నది భారతీయ తాత్వికత. కానీ ఈ ప్రపంచం యుద్ధాలతో అట్టుడికిపోతున్నది. పెనువిధ్వంసానికి లోనవుతున్నది. అనేక దేశాలమధ్య యుద్ధాలు, ఘర్షణలు, ఉగ్రమూకల హింసాత్మక ధోరణులు ప్రబలిపోయి శాంతిని అపహాస్యం చేస్తున్నాయి. విశ్వశాంతి అన్నది కలగా మిగిలిపోయింది. కానీ 'విశ్వపుత్రికను నేను విశ్వశాంతి నా ఆకాంక్ష' అని చెబుతున్నారు డా. విజయలక్ష్మి పండిట్.

"విశ్వమానవ సౌభ్రాతృత్వం
విశ్వ మానత్వం
విశ్వప్రేమ
విశ్వశాంతి లక్ష్యమై
ప్రతి మనిషి శాంతి తపస్సుకై
శాంతి దూతై కదలాలి" అని ఆకాంక్షిస్తున్నారు కవయిత్రి. "ఆధిపత్య అహంకార శిథిలాలపై/ మానవత్వం వెల్లివిరిసేలా నవ నాగరికతలను నిర్మించుకోవాలని" ఆశిస్తున్నారు.

"ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి
బుద్ధం శరణం గచ్ఛామి" అని ప్రవచించిన బుద్ధుని బోధనలు ఆదర్శంగా విశ్వశాంతి కోసం క్రియాశీలురై వ్యవహరించాల్సిన అవసరాన్ని ఆర్ద్రపూరిత స్వరంతో చెబుతుందీ కావ్యం. ఈ రీతిన లోకశ్రేయస్సును కాంక్షిస్తూ రాసిన ఈ కవిత్వం సిలబస్‌లో భాగం కావాలి. తద్వారా చిన్నవయసులోనే పిల్లల్లో సాటి మనుషులపైన, జీవకోటిపైన ప్రేమ, కరుణ పాదుకుంటాయి. సంస్కారం, సున్నితత్వం అలవడుతాయి.

దీర్ఘకవితల ద్వారా ప్రపంచ గమనంలో మార్పు రావాలని ఆశించే 'విశ్వపుత్రిక' సూక్ష్మమైన కవితా రూపం 'హైకూ'ల ద్వారా జీవన తాత్వికతను అభివ్యక్తం చేశారు. అల్పాక్షరాల్లో అనల్పమైన భావాలను పొదువుకున్న హైకూను సాధనంగా చేసుకొన్నారు. మానవీయ భావనల్ని, ప్రాకృతిక సౌందర్యాన్ని నిసర్గరీతిన చిత్రించి పరవశింపజేశారు. నిశ్శబ్దాన్ని వెలిగించే హైకూలతో 'వాక్యం రసాత్మకం' అనే మాటను స్ఫురింపజేశారు.

అయిదు దశాబ్దాల ప్రయాణంలో ఇతర ప్రక్రియల్లో రచనలు చేసినప్పటికీ నిరంతర కవితా రచన ద్వారా తన అంతరంగాన్ని అభివ్యక్తం చేస్తూ తెలుగు కవితామతల్లిని సత్కరించారు డా. విజయలక్ష్మి పండిట్. ఆమె ఊహాశాలిత, పదచిత్రాలు, భావచిత్రాలు, సాంద్రతరమైన వ్యక్తీకరణలు ఈ కవిత్వాన్ని దీప్తిమంతం చేశాయి. పాఠకుల్లో హృదయ సంస్కారానికి దారులు పరిచాయి. మహిళలని మనుషులుగా చూసే దృష్టికోణాన్ని అందించాయి. ప్రకృతిని, మానవాళిని విపత్తులకు లోను చేసే అభివృద్ధి విధానాల అపసవ్యతల్ని ప్రశ్నించాయి. మనకోసం, మన భావితరాల క్షేమం కోసం ఈ పృథ్వీతలాన్ని కాపాడుకునే చైతన్యాన్ని ప్రోది చేశాయి. ఈ క్రమాన మనుషుల్లో చెడును పరిహరించేందుకు, మంచిని పెంచేందుకు తోడ్పడే ఈ కవిత్వం 'విశ్వశ్రేయం కావ్యం' అన్న సూక్తికి నిదర్శనంగా నిలుస్తుంది. ఇదే డా. విజయలక్ష్మి పండిట్ కవితాసృష్టి సాఫల్యం.

– గుడిపాటి



నిత్యం సుప్రభాతం మేల్కొల్పే..!!

నిత్యం మనసును ఒక సుప్రభాతం మేల్కొల్పే
మౌనాన్ని పెకల్చి బయలుదేరే
మగతను చీల్చుకొని ఉద్భవించే
ఆకాశములో ఉషస్సులా ఎగిరేందుకు..
ఉన్నత నాదంలా ఎగిసే జలపాతం
అరణ్య ఘోషలో వసంతాన్ని మేల్కొల్పుతూ
కొండ అంచుకు పచ్చని కోకను చుట్టుతూ
వేర్ల నరాల్లో తీగలను సవరిస్తూ సాగుతుంది..
గుండె లోయలో నిత్యం గర్జిస్తూ
మస్తిష్కంలో మధన పడుతూ
అక్షరం ఆలోచనలతో మార్మోగుతుంది
ఒయాసిస్ వెంట వసంతాన్ని చూసేందుకు..
నిత్యం ఎన్ని ఒడుగులో అన్ని పరుగులు
ప్రకృతి ఘోషల్ని పాఠాలుగా చదువుతూ
పసి మనసు హృదయంలా ఆస్వాదిస్తూ
నలుదిశలు పిక్కటిల్లేలా అక్షరాలతో అరుపులు..
భూమి గర్భం ప్రసవించిన పచ్చదనం
ఎన్నో మబ్బుల నీడల్లో ఎదుగుతుంది
ఎలుగెత్తిన నీటి చుక్క స్నానం చేయిస్తే
హృదయములో నాదవర్షం మోగుతున్నది...
ఎక్కడో ఒక ఏటిగట్టు చలువలో
ప్రక్కనున్న వృక్షముపై రెక్కలాడిస్తుంది పక్షి
మారుతానికి మనసు కరిగేలా
కొమ్మపై కోటి రాగాలు పలికిస్తుంది..
ఊపిరిలో శృతులు నేర్చుకుంది అక్షరం
మనసు వెదురు బొంగును కాల్చి వేణువు చేసి
పంచభూతాల వేళలు పలకరిస్తూ
నిత్యం పరవశించిపోతుంది
రసధ్వనిలో మనసు తాళం..

–కొప్పుల ప్రసాద్
9885066235

పాడుతా పాలస్తీనా స్ఫూర్తిని

ఏమని చెప్పను గాజా గాథను
ఏమని పాడను గాజా గాయాలను
ఏమని చెప్పను ఇజ్రాయెల్ దుర్మార్గం
ఏమని పాడను ఈ నెత్తుటి గేయము
అమెరికోడి అండతోని రెచ్చిపోయి పిచ్చిపట్టి
పాలస్తీనా ప్రజల రక్తాలను తాగుకుంటు
యుద్ధోన్మాది ఇజ్రాయెల్ దాడులను చేసుకుంటు
పాలస్తీనా ప్రజల ప్రాణాలను తీస్తుంటే
॥ఏమని చెప్పను॥
స్వేచ్ఛా స్వాతంత్ర్యం కోసము
తరాల నుండి పోరుతున్నరు
తాతల తండ్రుల నుండి సాగుతుంది ఈ పోరు
ఐనా దక్కలేదు వారికి స్వాతంత్ర్యము
॥ఏమని చెప్పను॥
యూదుల యుద్ధం అధర్మమే
ఇజ్రాయెల్ తరిత ఊచకోతలే
వలసొచ్చి పాలస్తీనాను ఆక్రమించి అణిచివేస్తు
నేరాలకు పాల్పడుతు గోరాలాను చేస్తువుంటె
॥ఏమని చెప్పను॥
గాజా గుండె నిండ గాయాలే
పాలస్తీనా నిలువెల్ల త్యాగాలే
నెత్తుటి కూటికి మరిగిన ఇజ్రాయెల్ ఆకలికి
పిల్లా జెల్లా ఎందరొ బలి అయ్యి పోతుంట
॥ఏమని చెప్పను॥
బాంబులతో దాడులను చేస్తూ
సైన్యంతో చుట్టు ముట్టుతుంటే
చావో రేవో ఇంకా తేల్చుకోను సిద్ధమయ్యి
గాజా చేస్తుంది ఈ అంతిమ యుద్ధాన్ని.
॥ఏమని చెప్పను॥
పాలస్తీనా స్ఫూర్తి నిలవాలే
గాజా పోరాటం గెలవాలే
అమెరికోడి అండతోని ఎగురుతున్న ఇజ్రాయెల్ను
గుండెలపై ఎగిరి తన్ని నేల కూల్చివేయగ
॥ఏమని చెప్పను॥
పాడుతా పాలస్తీనా స్ఫూర్తిని
నే పాడుతాను గాజా తెగువను
నేను చాటుతాను పాలస్తీనా త్యాగాలను
నేను మీటుతాను గాజా యుద్ధ గీతాలను
నేను ఏకుతాను
ఇజ్రాయెల్ గోర నేరాలను "పాడుతా"



–ఉప్పెన 8106073661

నానీ

కన్నీటిని
రెప్పల్లోనే బంధించకు
మహాసముద్రమై
నిన్నే ముంచేస్తుంది.

–డా॥ సి. భవానీదేవి
9866847000

మేక ధైర్యం

కథ

నరసింహ పురం లోని ఒక మేకల గుంపు మేత మేయడానికి బయలుదేరింది. ఆ గుంపులో అన్నింటికన్నా ముందు ఒక పిల్ల మేక ఉంది. దానిని అనుసరించే మిగతా మేకలు వెళ్లుతున్నాయి . అవి అలా కొంత దూరం నడిచాయి. ఇంతలో ఆ పిల్ల మేక తన ముందుకు వచ్చిన ఒక తొండను చూసి పాము అనుకుని 'పాము,పాము' అంటూ వెనుకకు తిరిగి ఒకే పరుగు తీసింది. మిగతా మేకలు కూడా భయపడి వెనుకకు తిరిగి దాన్ని అనుసరించాయి.

అలా కొద్ది దూరం వెళ్ళిన తర్వాత ఆ మేకలు ఆగాయి. అప్పుడు ఒక ముసలి మేక " ఛీ! ఛీ! అనవసరంగా ఇంత దూరం పరిగెత్తుకొని వచ్చాము. అది పాము కానే కాదు. తొండ " అని అంది. " మరి నీవు ఈ సంగతి అక్కడనే చెబితే బాగుండేది కదా! ఇంత దూరం రాకపోదుము గదా! అనవసరంగా భయపడ్డాము. నీకు తెలిసి కూడా మా వెంబడి ఎందుకు వచ్చావు" అని ఒక మేక దానిని నిలదీసింది. అప్పుడు అది "ముందు మేక ఎటువైపు వెళితే దానిని మనం అనుసరిస్తాము కదా! అందువల్ల నేను కూడా మీతో పాటు మీ వెంబడి పరిగెత్తి వచ్చాను" అని అంది. అప్పుడు ఆ మేక " అయితే ముసలి మేకవు. అనుభవశాలివి . నీవే ముందు ఉండి మమ్మల్ని అందరినీ నడిపించు" అని అంది మరొక మేక . అప్పుడు ఆ ముసలి మేక సరేనంది. తర్వాత ఈసారి ఆ ముసలి మేక ముందుగా, తర్వాత మిగతా మేకలు నడవసాగాయి. ఇలా అవి కొద్ది దూరం నడిచాయి. ఆ ముసలి మేకకు కంటి చూపు తక్కువ. అందువల్ల అది దూరాన ఉన్న కుక్కను చూసి తోడేలు అని అనుకొని " అమ్మో! తోడేలు" అంటూ వెనుకకు తిరిగి ఒకే పరుగు తీసింది. దాని వెంబడి మిగతా మేకలు కూడా పరుగు తీసాయి.

ఆ తర్వాత అవి కొద్ది దూరం వెళ్లి ఆగాయి. అందులో ఒక మేక " అది తోడేలు కాదు . కుక్క" అని అంది . వెంటనే మరొక మేక " ఈ సంగతి ముందుగానే చెబితే బాగుండేది కదా! న

పిట్టె కనికరం

కథ

నిత్తెడి లెక్కే గారోజు సుత పొద్దుగాళ్లనే నిదుర లేచి వాకింగ్ కని బయటికి బయలెల్లిన, మా ఇంటి ముందలున్న గుబురు పొదల మీద పిచ్చుకలు, కిలకిలమని అరుస్తున్నవి.

గవ్విట్ని సూడంగానే నా మనసుల ఒక ఆలోచన మెదిలె పంటసేండ్లు లేక ఖాళీ జాగల్లేక అన్నీ ఇండ్లయ్యేసరికల్లా గవ్విటికి తిన తిండి గింజలు సుత కరువైపాయనే అని.

గందుకని గారోజు మా ఇంటి ఆవార గోడ మీద శారెడు బియ్యం గింజలు సల్లిన. గట్టసల్లిన నిమిషంలనె గుంపులు గుంపుల పిట్టెలొచ్చి సల్లిన గింజలు సాంతం తినేసె.

గానాడు మొదలు దినాం పొద్దుగాల నేను వాకింగ్‌కెల్లేటప్పుడు బియ్యం గింజలు ఏసుడు నేను వొచ్చేసరికి గా పిట్టెలొచ్చి తినుడు. గిట్ల ఓ నెల దినాలైపాయె.

ఏనాడైనా గా గింజలు సల్లుడు లేటైతే ఆవార గోడ దగ్గరికొచ్చి అరసి అరసి గోల గోలసేటివి గా సప్పుడికి నా ఒంట్లో సుస్తీ చేసినా ఓపిక తెచ్చుకొని గింజ లేసేటోన్ని.

గిట్ల యాదాది సంది నేను గింజలేసుడు, అవొచ్చి తినుడు మామూలైపోయింది.

ఇదిలా ఉండగా ఒక దినంలా ఎప్పటి మాదిరే గింజలేసి వాకింగ్‌కెళ్లివొచ్చి, వొచ్చి చూద్దును కదా! నేను వేసిన బియ్యం గింజలు వేసినట్లే ఉన్నయి. గండ్లకెళ్లి ఒక్క బియ్యం గింజ తిన్నట్లయినిపించలే. గిదేంటి ఒక్క పిట్టైనా రాలేదెందుకని సోంచు చేసుకుంటావే, ఇంటి బయటికెళ్లి నాల్గు దిక్కుల వెతికి చూస్తిని గదా! ఓ ఫర్లాంగు దూరంలా సడాకు మీద పిట్టెల గుంపు కనవడింది. ఏమిటా? అని సోంచు చేసుకుంటనే అటు దిక్కెళ్లిన. నేను వాటి దగ్గరికెల్తినో లేదో బుర్రుమని నా పిట్టెలన్నీ ఒక్కసారి లేచి ఎగిరిపోయినై. అవి లేసిన దగ్గర కొంచెం పరీక్షగా చూస్తి. ఇంకేముంది ఓ పిట్టె చచ్చిపడి ఉన్నది.

అది చూసి బాధతో అరే పాపం పిట్టె సచ్చిందుందని దాన్ని తీసి పక్కనే పారుతున్న నీటి కాలువలో పడేసి చేతులూ, కాళ్లూ కడుక్కొని ఇంటికి వొచ్చేసిన. గేటు తీసుకొని లోపల అడుగు పెడ్తినో లేదో గంతలోనే ఆ పిట్టెల గుంపు మా ఇంటి ప్రహారీ మీద వాలి గింజలు ఏరుక తినవట్టె.

గీ ఇషయం గమనించిన నేను ముక్కునేలేసుకొని సోంచు చేసుడు షురువు చేసిన. గిట్లేందని? కొద్ది సేపటికి నాకు ఓ ఇషయం తెల్సిందేందంటే, గీ రోజుల్ల మస్తు రకాల జ్ఞానమున్న మనిషి తన తోటి మనిషి, పమాదంతో రోడ్డు మీద పడి సావు బతుకుల్లో ఉంటే సుత తమకేమీ సంబంధం లేనట్ల, తమ కండ్లకు కనవడనట్ల, ఏ కొంచెంసుత కనికరం లేక ఎళ్లిపోతున్నారు?" గని గా పిట్టెలకున్న కనికరం మనలో ఉంటే ఎంత బాగుండు. పైసలు పెరుగుతున్నై, సదువు పెరుగుతున్నది గని మనిషిలో గీ కనికరం ఇగిరం ఎప్పుడు కలుగుతుందో అని.

నీతి: ప్రతి వారిలో జీవ కారణ్యం ఉండాలని, పశుపక్షాదుల్నే కాదు తోటి మనుష్యుల్లో కూడా కరుణ పెరగాలని..

-దారం గంగాధర్
సెల్:9848384777

గాలిపటం

ఒక పాతదైన పేపరు
రెండు చీపురు పుల్లలు
కాసిని అన్నం మెతుకులు
కొంచెం తోక అతికేస్తే
అంద చందాల గాలిపటం!

చేతికి చూపుకు బంధం కలుపుతూ
వీచే గాలికి ఉయ్యాలలు ఊగుతూ
చెట్లు చేమలు దాటి పరిగెడుతూ
గగనాన్ని చేరాలని ఆరాటపడే
ఆకాశదీపం గాలిపటం.

తోకను వయ్యారంగా ఊపుకుంటూ
గాలిని సర్రుసర్రున తోసుకుంటూ
దారాన్ని గట్టిగా లాగేసుకుంటూ
నింగిలోకి చకచకా దూసుకెళ్ళే
తోక చుక్క గాలిపటం!

గాలిలో పైకీ కిందికీ గిరికీలు కొడుతూ
తారల మధ్య తారకలా రెపరెపలాడుతూ
విభిన్న అకారాల్లో తేలియాడుతూ
పిల్లల కళ్ళల్లో సంతోషాలు పూయించే
మెరుపుల గాలిపటం

-డా॥కందేపి రాణీప్రసాద్
98661 60378

సునందామృతం

గృహ మార్జాల న్యాయము

గృహం అంటే ఇల్లు. మార్జాలం అంటే పిల్లి.పిల్లి ఇంటిని కనిపెట్టుకుని ఉంటుంది. కానీ దానికంతగా గౌరవం ఇవ్వం.ఏనుగు బయట ఉన్నప్పటికీ దానికి ఎంతో గౌరవం ఇస్తాం.

కారణం ఎందుకో వేమన పద్యంలో చూద్దాం.

ఉన్న ఘనతను బట్టి మన్నింతురే కాని/ పిన్న పెద్ద తనము నెన్నబోరు/వాసుదేవు విడిచి వసుదేవు నెంతురా/ విశ్వదాభిరామ వినురవేమ.

ఇందులో వ్యక్తి చేసే పనులను, అతనిలోని ప్రతిభను బట్టి సమాజంలో కీర్తి ప్రతిష్టలు, గౌరవం లభిస్తాయి. అంతే గానీ అతడు వయసులో చిన్న లేదా పెద్ద అనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోరు.

వాసుదేవుడు అంటే శ్రీకృష్ణుడు. వసుదేవుని కుమారుడు. అయితే వసుదేవుడు, వాసుదేవుడు తండ్రీ కొడుకులు.వయసులో పెద్ద వాడు కదానా వసుదేవుని గౌరవిస్తారా.కీర్తిస్తారా... అలా చేయరు కదా! ఎంతో ప్రతిభ ఉండి ఎన్నో ఘనకార్యాలు చేశాడు కాబట్టి చిన్నవాడైప్పటికీ శ్రీకృష్ణుడినే కొలుస్తారు.

ఇక్కడ గ్రహించ వలసింది ఏమిటంటే పిల్లి, ఏనుగు రెండూ జంతువులే. అపిల్లి మన ఇళ్ళలో తిరిగేదే. వాటిని చిన్నా పెద్దా అనే తేడా పక్కన పెడితే ఏనుగు ప్రత్యేకమైన లక్షణాలతో గౌరవింపబడుతుందనేది మనకు తెలిసిందే.×

అలాగే మనుషులు కూడా ...చిన్నా ,పెద్దా,వర్గ వర్ణ భేదం లేకుండా తమ తమ ప్రతిభ,సామర్థ్యాలతో కూడిన వ్యక్తిత్వాలతో మాత్రమే గౌరవం పొందుతారనేది ఈ గృహ మార్జాల న్యాయము ద్వారా తెలుసుకోవచ్చు.×

ఇదే విషయాన్ని ఉదహరిస్తూ రాసిన మారద వెంకయ్య గారి భాస్కర శతక పద్యం చూద్దాం.×

పండితులైన వారు దిగువందగ నుండగ నల్పుడొక్కడు/ద్దండత బీరమెక్కిన బుధ ప్రకరంబుల కేమి యెగ్గగున్/ కొండొక కోతి చెట్టు కొనకొమ్మనుండగ క్రింద గండభే/రుండమదేభ సింహ నికురంబులుండవె చేరి భాస్కరా!×

ఈ పద్యం యొక్క భావం:- పండితులైన వారందరూ కింద కూర్చుని ఉండగా ఒక అల్పుడు అంటే విద్యా, జ్ఞాన హీనుడు అగ్రాసనం/ ఉన్నత స్థానం మీద కూర్చున్నంత మాత్రాన పండితుల విలువేం తగ్గదు. ఎందుకంటే మదవు టేనుగులు, సింహాలు,గండభేరుండం లాంటి పక్షులు చెట్టు కింద ఉండగా చెట్టు కొన కొమ్మల మీద కోతి తిరుగుతూ ఉంటుంది కదా!×

ఇంట్లో వారైనా అంటే బంధువర్గం వారైనా, తెలియని వారైనా వారి వారి పనులు, ప్రవర్తన, ప్రతిభా సామర్థ్యాలచే మాత్రమే లోకంలో కీర్తి ప్రతిష్టలు గౌరవం పొందుతారనేది గ్రహించాలి.×

ఇలాంటి వాటికి ఈ గృహ మార్జాల న్యాయము న్యాయం సరిగ్గా సరిపోతుంది.×

-పురిమళ్ల సునంద
9441815722

నాగన్న పదాలు

గుమ్మానికి పూబంతి
సిగలోన చేమంతి
గృహ సీమన "ఇంతి"
ఓరి! నాగన్న.

నాన్నగారి పోషణ
అమ్మగారి దీవెన
తోడు నీడన లలన
ఓరి! నాగన్న.

ఆశ చెడ్డది కాదు
అత్యాశ పనికి రాదు
దురాశ గుళిక చేదు
ఓరి! నాగన్న.

కన్యాదానము కన్న
అన్నదానము నెన్న
రక్తదానము మిన్న
ఓరి! నాగన్న.

వాసాల మరిగాంచె
విందు బోజన కుడిచె
కె.సి.ఆర్. సంతసించె
ఓరి! నాగన్న.

పట్నంలో బోనం
పందిట్లో బోజనం
'కరోన' వైభోగం
ఓరి! నాగన్న.

-నెమలికొండ నాగేశ్వర్ రావు
8688553470

పరివర్తన

కథ

ఎనిమిదేళ్ల వినయ్‌కి ఒక పెద్ద సందేహమే వచ్చింది. గబగబా అమ్మ దగ్గరకి పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"ఏవిట్రా ఆ కంగారుగ పడిపోతావు" అంటూ వాడిని పట్టుకుంది శ్యామల.

"అది కాదమ్మా! రేపు గాంధీగారి పుట్టిన రోజుని మా స్కూల్‌కి సెలవు ఇచ్చారు కదా!"

'ఔనూ.. దానికంత కంగారెందుకూ? ప్రతి సంవత్సరం ఇస్తారు కదా!"

మెల్లిగా అమ్మ పక్కన కూర్చుని తన సందేహం బయటపెట్టాడు వినయ్.

"సెలవు ఎందుకూ ఇవ్వడం?"

వింతగా చూసింది శ్యామల. హాయిగా సెలవొచ్చిందని సంబరపడకుండా ఈ ప్రశ్నేమిటి?

"అలాంటి మహాత్ములని ఊదాదికొకసారైనా మననం చేసుకుంటారని" తోచిన సమాధానం చెప్పేసి అమ్మయ్య అనుకుంది. తన కొడుకు సంగతి తనకి తెలియదా? ఒకదాని తర్వాత ఒకటి యక్షప్రశ్నలు వేస్తూనే ఉంటాడు మరి! వాడి బుర్ర చిన్నదేగానీ అందులో ఆలోచలు తెలివితేటలు ఎక్కువే మరి.

"మననం అంటే" రివ్వున వచ్చింది ఎదురు ప్రశ్న చిన్న బుర్రనించి.

"అంటే వాళ్లని బాగా గుర్తుచేసుకుంటూ తల్చుకోవాలి."

"సరే.. సరే" అంటూ బయటికి పరిగెత్తాడు వినయ్.

మళ్లీ అయిదు నిమిషాల్లోనే ప్రత్యక్షమయ్యాడు "అదికాదమ్మా!" అంటూ.

"మరీ మరీ మా ఫ్రెండ్సూ అంటున్నారూ ఆటలుకుందాం అంటున్నారు. మనం వొద్దంట ఎన్నారు."

నవ్వొచ్చింది శ్యామలకి. వాడు అనాలనుకున్నది మననం అన్నమాట. అర్థమైంది.

'పిల్లలు ఆడుకోకుండా ఎలా ఆడుకోండి. ఒక పని చెయ్యండిరా ఆటల్లోనే మీకు స్కూల్లో నేర్పిన దేశభక్తి పాటలూ మనదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వాళ్ళమీద పాటలూ వాళ్ళ గురించిన మాటలూ ఎవరికేం వస్తే అవి పాడుకోండి. చెప్పుకోండి. స్వాతంత్ర్యం కోసం ఎంతో కష్టపడ్డారు కదా గాంధీగారు. ఆయన్ని తల్చుకున్నట్టే అవుతుంది అప్పుడింక. సరేనా!"

ఆ మాటతో వాడి మొహంలో చెప్పలేనంత ఆనందం. అది చూసిన తల్లి కళ్ళు మెరవకుండా ఉంటాయా?

"నువ్వు చాలా బాగా చెప్పావు వాడికి శ్యామలా!" మెచ్చుకున్నాడు కిషోర్ భార్యని.

"పిల్లలకి పెద్దలే కదా మంచి చెప్పాలి. అది కూడా తోటకూర నాడే చెప్పకపోయావా అన్న సామెత ఉండనే ఉంది కదా! అందుకే చెప్పడం మన ధర్మం.చెప్పాలి. పెరిగి పెద్దయినాక వాళ్లెలా మారతారో అది తర్వాతి విషయం. మన తప్పు లేకుండా చూసుకుందాం. ఏమంటారు?" మృదువుగా అంది శ్యామల చిరునవ్వుతో.

"ఔనౌను" అన్నాడేగానీ కిషోర్ మనసు మూలల్లో గతం ఒక ముల్లులా గుచ్చుకుని కలుక్కుమంది.

స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు రాగానే అయిపోయిందా? వాటిని ఎంత జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. అది దేశమైనా, సమాజమైనా, కుటుంబమైనా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకి తగిన గౌరవం, విలువ ఇస్తేనే కదా వాటి ఉనికికి అర్థం ఉండేది. అవి నిరాటంకంగా మనగలిగేది.

ఎక్కడ స్వేచ్ఛ ఉంటుందో అక్కడ బాధ్యతా ఉండాలి కలగలిసి. ఎక్కడ స్వాతంత్ర్యం ఉంటుందో అక్కడ వివేకం విచక్షణా జ్ఞానం వెలుగుపూవులై ఎప్పుడూ వికసిస్తూనే ఉండాలి.

స్వాతంత్ర్యం వచ్చాక దేశంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగానే ప్రవర్తిస్తున్నారా? స్వేచ్ఛని దుర్వినియోగం చెయ్యకుండా నడుచుకుం టున్నారా?

కుటుంబాల్లో వ్యక్తులు వివేకం విచక్షణా జ్ఞానం తోనే మెలుగుతు న్నారా? కూర్చున్న చోటి నించి లేచి బయటి వరండా లోకి వెళ్ళాడు కిషోర్.

గేటు పక్కన ఉన్న వేపచెట్టు కొమ్మల రెమ్మల్లో చిరుగాలికి ఊగుతున్న చేదునిజాలెన్నో తెల్లని పూలై తేలికపాటి పరిమళాన్ని పరిసరాల్లో నింపుతున్నాయి.

నిజం చేదుగా ఉన్నా ధర్మాన్ని కాపాడుతుంది. వేపపూలు చేదే కానీ ఆరోగ్యానికి మంచివి.

ఆలోచనల్లో తేలియాడుతోంది గతం కళ్ళముందు. అలా నిలబడిపోయాడు కిషోర్.

ప్రతిమనిషికీ ఉంటుంది గతం. కష్టాలూ సుఖాలూ లాభాలూ నష్టాలూ అన్నీ కలగలుపుగా అలలై కదులుతూనే ఉంటాయి అందులో. అపురూపమైనవి కొన్ని అయితే అలా జరగకుండా ఉంటే ఎంత బాగుండేది అని పదే పదే అనిపించేవి మరికొన్ని ఉంటాయి. అదిగో ఆ రెండో కోవకి చెందిన ఆలోచనలు చుట్టుముట్టిన పరిస్థితిలో ఉన్నాడు కిషోర్ ఇప్పుడు.

తనని చూసి ఎగతాళిగా నవ్వుతున్న బాబాయ్ పిన్నీ కళ్ళముందు.

"ఎందుకు నన్ను చూసి ఎప్పుడూ అలా నవ్వుతారు మీరిద్దరూ?"

"నవ్వక ఏం చెయ్యమంటావు చెప్పు! నీ ఈడువాడే కదా మా గోపీ? ఎంత స్వతంత్ర్యం ఇస్తున్నాం వాడికి మేము. మీ అమ్మా నాన్నా నువ్వెక్కడికి వెళ్ళేదీ ఎప్పడింటికి వచ్చేదీ అన్నీ అడుగుతారు కదా నిన్ను!"

వాళ్ళ చూపుల్లో చులకనభావం భరించడం కష్టమే అయింది పదహారేళ్ళ కుర్రాడు కిషోర్‌కి.

వెంటనే అమ్మా నాన్నల మీద కోపం కూడా వచ్చేసింది.

ఔను! తనకెందుకు వాడికిచ్చినంత స్వతంత్ర్యం ఇవ్వట్లేదు అమ్మా నాన్న అని ఆలోచనలో పడ్డాడేగానీ వాళ్ళు తననేమీ అడగకుండా తనకి సంబంధించిన విషయాల్లో నిర్ణయాలు తీసేసుకోవట్లేదు. వాళ్ళ విషయాలు కూడా తనతో అన్నీ సరదాగా చెప్తూ కలిసి చర్చిస్తూనే ఉంటారు. చదువుకి సంబంధించి కూడా వాళ్ళేమీ తనని ఒత్తిడి చెయ్యరు. స్నేహితులతో కలిసి సినిమాకి వెళ్ళడానికి అభ్యం తరం పెట్టరు. స్నేహితుల్లా తనతో మాట్లాడతారు. ఇంతకన్నా స్వేచ్ఛ స్వాతంత్ర్యం ఏం కావాలి ఎందులో కావాలి అనే ఆలోచన రాలేదు.

ఆ రాత్రంతా అదే మెదులుతూ ఉంది మనసులో. చివరికి తట్టింది. తనెక్కడికైనా వెళ్తే ఎక్కడికి వెళ్తున్నదీ, మళ్ళీ సుమారుగా ఎన్ని గంటలకి ఇంటికి వచ్చేదీ చెప్పి వెళ్ళమంటారు. ఔను ఇందులో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేవు తనకి. బాబాయి పిన్నీ అందుకే ఎగతాళిగా నవ్వుతారు తనని చూసి. ఇంక తను మారిపోయి చూపించాలి వాళ్ళకి.

తీసుకున్న ఆ నిర్ణయంతో హాయిగా నిద్రపోయాడు కిషోర్.

ఈ మధ్య కొడుకులో వచ్చిన మార్పుకి ఆశ్చర్యమే కాదు కాస్త భయం కూడా కలుగుతోంది సావిత్రికి. ఇదివరకెప్పుడూ లేదు. కొత్తగా ఇలా మొదలు పెట్టాడేమిటన్న చింత. సెలవు రోజు వచ్చిందంటే చాలు బయట తిరగడానికి వెళ్ళిపోడమే కాదు, ఎక్కడికి వెళ్తున్నదీ, ఎప్పుడు వచ్చేదీ ఏమీ చెప్పడు. ఇంటికి వచ్చాక యధాలాపంగా అడిగినా కూడా కోపంతో చూడటం. గట్టిగా ఒక మాట చెప్పడానికి లేదు, అడగటానికి లేదు.

ఆ రోజు కిషోర్ తాతగారి శ్రాద్ధకర్మ జరుగుతోంది ఇంట్లో. ఆదివారమైంది. పిల్లలకి సెలవు. సరిగ్గా భోజనం వేళ కిషోర్ని తనతో వెంటపెట్టుకుని హోటల్‌కి తీసుకుపోయాడు గోపీ. కిషోర్ రానని అన్నా కూడా తను చెప్పినట్టు వినకపోతే క్రికెట్ ఆడటానికి తమ టీమ్‌లోకి రానివ్వనని బెదిరించాడు. దాంతో గోపీ వెంట అనాలోచితంగా వెళ్ళిపోయాడు కిషోర్.

దీనికి మూలకారణం మరిది, తోటికోడలే అని ఎప్పుడైతే బయటపడిందో అప్పుడింక ఊరుకోలేక పోయింది సావిత్రి. ఎప్పుడూ తాతగారి పేరే తలవనివ్వవు గోపీని. కనీసం ఆయన తద్దినం రోజైనా ఆయన పేరు తల్చుకుని ఇంట్లో భోజనం చెయ్యనివ్వలేదు నువ్వు. వాడికి భయపడి వాడు ఆడమన్నట్లల్లా ఆడటం నేర్చుకుని పెడదారి పడుతున్నాడు మా పిల్లాడు కూడా. ఎందుకు నువ్వు అర్థమయ్యేలా నచ్చచెప్పుకోవు నీ కొడుక్కి అంటూ గయ్యిమంది తోటికోడలిమీద.

చిలికి చిలికి గాలివానై ఉమ్మడికుటుంబం వేరు పడటానికి అట్టే రోజులు పట్టలేదు.

కిషోర్‌కి చాలా బాధ అనిపించింది. అది ఎప్పటికీ అలా మనసులో ముద్ర వేసుకుని ఉండిపోయింది. అది చెరపలేని ముద్ర తీయలేని ముల్లు.

అలా జరగకుండా ఉంటే ఎంత బావుండేది అని అనిపించే గతం.

ఎందుకంటే తనకి తోడబుట్టినవాళ్ళు లేరు. గోపీ అంటే తనకి ఎంతో ఇష్టం. ఉన్న ఆ ఒక్క సోదరుడూ దూరమైపోయాడు. తన కుటుంబం వైపు కన్నెత్తి చూడడు.

అప్పుడే లోపలికి వస్తున్న కొడుకుని దగ్గరగా తీసుకున్నాడు. వాడి మొహంలో అందరి పోలికలూ కనిపించాయి.

తన తండ్రి, తమ్ముడు, తమ్ముడి కొడుకు.

చిన్నగా నిట్టూర్పు విడిచాడు అప్రయత్నంగా.

కొన్ని కొన్ని సంఘటనలు ఎందుకలా జరిగిపోతుంటాయి? అర్థం కాని ప్రశ్న కళ్ళముందు కొండలా.

ఆ కొండని దాటగలిగితే బోధపడుతుందేమో జీవితం.

గేట్ లోపలికి వస్తున్న శీనుని చూడగానే నెత్తిన ఎవరో మొట్టినట్టయ్యింది. తను చేస్తున్న పనేమిటి ఆ రోజుల్లో ఒక నీతీ, ఈ రోజుల్లో ఒక నీతీనా తనకి? స్వేచ్ఛాస్వాతంత్ర్యం అన్నవాటికి అడుగడుక్కీ అర్థం మార్చేసుకుం టున్నాడా తను? పిల్లలకి చెప్పడం వరకేనా నీతిపాఠాలు? పెద్దలు పాటించనవసరం లేదా?

శ్యామల తనని మనస్పూర్తిగా నమ్మింది కాబట్టి ఏ ప్రశ్నలూ వెయ్యదు కనక స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకి అర్థం ఇష్టం వచ్చిన రీతిలో అవినీతితో బ్రతకడమే నని చెప్పుకున్నాడా తనకి తను.అసలైనా అడిగేవాళ్ళు లేకపోతే అవినీతితో బతకమని చెప్పారా ఎవరన్నా?

వరండా వెంట్లు దిగి గబగబా తనే ఎదురెళ్ళాడు శీనూకి.

"క్షమించు శీనూ! నేను రావట్లేదు. నువ్వింటికి వెళ్ళిపో. నేను ఎవరి దగ్గర్నించీ లంచం తీసుకోదల్చుకోలేదు". తన మాటలు తనకే పన్నీటిజల్లులా అనిపించి చాలా హాయిగా ఉంది కిషోర్‌కి. చేసుకుంటున్న ఉద్యోగం మనశ్శాంతిగా చేసుకోగలనన్న ధీమా కూడా కలిగింది ఆ క్షణంలో. అదేనేమో అసలు సిసలు స్వతంత్ర్యం అంటే.

"ఏం మాట్లాడుతున్నావు ఒక్క సంతకం పెడితే యాభై లక్షలు. ఇన్నాళ్ళూ ఎప్పుడూ చెయ్యలేదా ఇలాంటి పనులు. రొంపిలో దిగేముందే ఆలోచించుకోవాలి. నువ్వెప్పుడో దిగిపోయావు. ఇంక ఇప్పుడేం చేస్తావు!"

"ఇప్పటికైనా అందులోంచి దిగే ప్రయత్నం చెయ్యకూడదా?" విసురుగా వచ్చింది కిషోర్ సమాధానం.

"జైలుకి వెళ్ళాల్సిన పరిస్థితి రాకముందే తప్పుదిద్దుకునే ప్రయత్నం చెయ్యకూడదా?" పరివర్తన ధ్వనించింది ఆ మాటల్లో.

అప్పుడే వరండాలోకి వచ్చిన శ్యామల తన అన్నగారిని చూసి అంది "లోపలికి రా అన్నయ్యా! కాఫీ తాగి వెళ్దువుగాని.."

మాట్లాడకుండా ఏదో ఆలోచిస్తూ నిలబడిపోయాడు శీను. బహుశా జైల్లో బావమరిది తోడు లేకుండా తాను ఒక్కడూ ఉన్న దృశ్యం కళ్ళముందు కనపడుతున్నట్టుంది.

చిన్నప్పటినుంచీ కూడా నీతి పాఠాలు పల్లె వేసే పెద్ద చెల్లెలంటే తగని కోపం శీనూకి. ఇప్పుడు తన మీద కూడా ఒళ్లుమండుతోంది కదా బావమరిదికి. ఎప్పుడూ లోపలికి రానివాడు ఇప్పుడెందుకు వస్తాడసలు!

కిషోర్ మనసులో సందేహం. శీను జేబులో సెల్ మోగింది. తీసి మాట్లాడుతున్నప్పుడు అతని ముఖ కవళికలు మారడం గమనించాడు కిషోర్. "ఏమైంది శీనూ!" అంటూ కంగారుపడ్డాడు.

నిట్టూర్చాడు శీను. "నువ్వు ఆఫీసులో కాగితాలు గోల్‌మాల్ చేసి సంతకం పెట్టకపోతే యాభై లక్షల డబ్బు లంచం ఎలా వస్తుంది? అది పంపకపోతే నా చిన్నచెల్లెలి కాపరం నిలబడదు. నాకొచ్చే ఫోన్లు అవేగా?"

"చూడు శీనూ! ఇన్నాళ్ళూ నీ మాట పట్టుకుని నీ చిన్న చెల్లెలి కాపరం నిలబెట్టడం కోసం అందిన చోటల్లా లంచాలు పుచ్చుకుని అందిస్తూనే ఉన్నాను నేను. ఎన్నాళ్ళిలా వాడి బెదిరింపులకి మనం భయపడుతూ ఉండాలి. తోటకూర నాడే మనం నిక్కచ్చిగా ఉండకపోవడం మన తప్పు కూడా ఉంది. వాడి ధనదాహం తీరేది కాదు.ఒక్కటి ఆలోచించు నువ్వు. రోజులన్నీ మనకి అనుకూలం గా ఉండవు. మనం జైలుకి వెళ్తే నీ ఇద్దరు చెల్లెళ్ళకీ మనిషి సాయం, మాట సాయం కూడా ఉండదు.నువ్వు గానీ, నీ చెల్లెలుగానీ ఇంక నించీ బెదిరింపులకి లొంగేది లేదని వాడికి అర్థమయ్యేలా తెలియజేసేందుకు ఏం చెయ్యాలో అది ఆలోచిద్దాం. అంతేగానీ తప్పుతోవలో నడవద్దు".

"మావయ్యా! మావయ్యా! నేను పెద్దయ్యాక పోలీసు అవుతాను. దొంగల్ని పట్టేసుకుంటాను. పరిగెత్తుకుంటూ వచ్చి సంబరంగా శీను మావయ్యని గట్టిగా పట్టుకుని చుట్టేస్తూ అన్నాడు వినయ్. చాలామంది పిల్లలకి ఉన్నట్టే పోలీసు ఉద్యోగం అంటే ఎంతో ఇష్టం వినయ్‌కి.

తుళ్ళిపడ్డాడు శీను. కిషోర్ కూడా కాస్త తత్తరపడ్డాడు. కొంచెంసేపటి క్రితం కిషోర్‌కి కలిగిన సందేహాన్ని పటాపంచలు చేస్తూ అతని చేయి పుచ్చుకుని అడుగు ఇంట్లోకే వేశాడు శీను.

మంచికైనా చెడుకైనా మనిషికి మరో మనిషి తోడు అవసరమేమో. అంతేకాదు. మనిషి మారడానికి పది రోజులో పది నెలలో పది సంవత్సరాల కాలమో పట్టాలని లేదు. పది సెకన్ల సమయమైనా చాలు.. నిజం..

> "ఏం మాట్లాడుతున్నావు
> ఒక్క సంతకం పెడితే యాభై లక్షలు.
> ఇన్నాళ్ళూ ఎప్పుడూ చెయ్యలేదా
> ఇలాంటి పనులు.
> రొంపిలో దిగేముందే ఆలోచించుకోవాలి.
> నువ్వెప్పుడో దిగిపోయావు.

-తమిరిశ జానకి
9441187182

తెలుగు భాష, సంస్కృతిని కాపాడుకోవాలి

-ఆటా అంతర్జాతీయ సాహితీ వేడుకల్లో వక్తలు

తెలుగు భాషను, సంస్కృతిని కాపాడు కొని జాతి గొప్పతనాన్ని నిలుపుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) ఆధ్వర్యంలో అంతర్జాతీయ సాహితీ వేడుకలను నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి, ప్రముఖ సినీనటుడు, కవి, రచయిత తనికెళ్ల భరణి ప్రారంభించారు. ప్రముఖ రచయిత కొలకలూరి ఇనాక్ సభాధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తెలుగు భాష, సంస్కృతుల పట్ల ఆటాకు అమితమైన ప్రేమ ఉన్నదని ఈ కార్యక్రమం ద్వారా తెలిసిందన్నారు. అమెరికాలో ఆటా ఆధ్వర్యంలో అమెరికా భారతి పేరుతో మాసపత్రిక ఆన్‌లైన్ ద్వారా నిర్వహించడం తెలుగుపై వారికున్న మమకారానికి నిదర్శనమన్నారు. అలాగే అమెరికాలో తెలుగు చదువుకోవడానికి యువతకు అన్ని విధాల సహకరిస్తున్న ఘనత వారిదేనని తెలిపారు. తెలుగు సాహిత్యంలో కృషి చేసిన వారిని గుర్తించి పురస్కారాలు అందజేసి వెలికితీసే ప్రక్రియను ఆటా చేయడం గొప్పగా ఉన్నదన్నారు.

'ప్రపంచీకరణ నేపథ్యంలో మీడియా రంగం' అనే అంశంపై ప్రముఖ రచయిత కాసుల ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన మొదటి సమావేశం నిర్వహించగా 'టీవీ ప్రసారాలు అప్పుడు-ఇప్పుడు' అనే అంశంపై శాంతి స్వరూప్, 'శ్రోతల జీవితాన్ని నిర్దేశించిన రేడియో' అంశంపై అయినంపూడి శ్రీలక్ష్మి, 'నూతన మాధ్యమాలు సత్యాసత్యాలు' అంశంపై ఆంధ్రజ్యోతి సంపాదకులు కె. శ్రీనివాస్, 'ఇవాలటి తెలుగు పరిశోధకులకు మార్గదర్శనం' అంశంపై సంగిశెట్టి శ్రీనివాస్, 'సాంకేతిక యుగంలో సాహిత్య పాత్ర' అంశంపై స్వామి తమ భావనలను వివరించారు. **'అనువాదం, నాటకం అవధానం'** అనే అంశంపై రూప్‌కుమార్ డబ్బికార్ అధ్యక్షతన రెండో సమావేశం నిర్వ హించగా, **'అనువాదంలో చిక్కులు సమస్యలు'** అంశంపై జే.ఎల్.రెడ్డి, **'అనువాద సాహిత్యం-ఆవశ్యకత'** అంశంపై నలిమెల భాస్కర్, **'తెలుగు నాటకం తీరూ తెన్నులు'** అంశంపై దెంచనాల శ్రీనివాస్, **'పరిశోధన, విమర్శ, సమాలోచనలు'** అంశంపై కొలకలూరి మధుజ్యోతి, **'అవధానంలో చమత్కారం'** అంశంపై నరాల రాంరెడ్డి వారి ఆలోచనలను పంచుకున్నారు.**'తెలుగు కథలు, నవల, విశ్లేషణ'** అనే అంశంపై వెల్దండి శ్రీధర్ అధ్యక్షతన 3వ సమావేశం నిర్వహిం చారు. **'జీవన స్రవంతి నవల-అనుభవాలు'** అనే అంశంపై టేకులపల్లి గోపాల్‌రెడ్డి, **'నవల సాహిత్యంలో కొత్త పోకడలు'** అంశంపై మధురంతకం నరేంద్ర, **'యువతపై నవల సాహిత్య ప్రభావం'** అంశంపై మధుబాబు, **'తరాల తెలుగు కథ'** అంశంపై పెద్దింటి అశోక్‌కుమార్, **'తెలుగు సాహిత్యంలో నవల ప్రాధాన్యత'** అంశంపై నన్నపురెడ్డి వెంకట్రామారెడ్డి, **'కథల్లో కొత్త దనం'** అనే అంశంపై మహ్మద్ గౌస్, **'కథ-సమాజం'** అంశంపై హు మా యూన్ సంఫీర్ తమ భావనలను వివరించారు.**'ఆధునిక కవితా పరిణామాలు'** అనే అంశంపై కవి యాకూబ్ అధ్య క్షతన 4వ సమావేశం నిర్వహించారు. ఎస్వీ సత్య నారాయణ, ఝాన్సీనివాస్‌రావు, నాళేశ్వరం శంక రం, ఏనుగు నరసింహారెడ్డి, మందా రప్ప హైమావతి, కొండపల్లి నిహారిణి, కందుకూరి శ్రీరాములు, పద్య కవితా శిల్ప సౌందర్యం అంశంపై జిల్లేపల్లి బ్రహ్మం తమ భావాలు, అభిప్రాయాలను పంచు కున్నారు. **గేయ సాహిత్యం** అనే అంశంపై రవీందర్ పసునూరి అధ్యక్షతన 5వ సమావేశం నిర్వహించా రు. ప్రముఖ గేయ రచయితలు సుద్దాల అశోక్‌తేజ, పెంచల దాసు, కాసర్ల శ్యామ్ పాటలతో ఉర్రూత లూగించారు.**'సినిమా సాహిత్య మేళవింపు'** అనే అంశంపై సినీ నటుడు తనికెళ్ల భరణి అధ్యక్షతన 6వ సమావేశం నిర్వహించగా **జనాభా దృశ్య కళా రూపాలు-ప్రదర్శన పద్ధతులు** అనే అంశంపై తప్పెట రాంప్రసాద్‌రెడ్డి, సినిమాల్లో జానపద కళా రూపాలు అంశంపై జలగం వేణు, దృశ్య మాధ్యమంలో చారిత్రక అంశాలపై అల్లాని శ్రీధర్, దృశ్య మాధ్యమంలో తెలుగు కవిత్వం అంశంపై మహ్మద్ షరీఫ్ తమ భావనలను వ్యక్తపరిచారు.ఆటా అంతర్జాతీయ సాహితీ సదస్సు ముగింపు వేడుకలకు ముఖ్య అతిథులుగా భాషా సంఘం మాజీ అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి, విశిష్ట అతిథిగా మాజీ రాజ

'నాగలి కూడా ఆయుధమే'

కవితా సంపుటి ఆవిష్కరణలో ప్రసిద్ధ కవి కె.శివారెడ్డికి అంకితం, ఘన సన్మానం

'నాగలి కూడా ఆయుధమే' కవితా సంపుటిని ఆవిష్కరించిన ఆచార్య కొలకలూరి ఇనాక్. వేదికపై ప్రముఖులు.

కొమ్మవరపు విల్సన్‌రావు కవిత్వం వినూత్నం, అభివ్యక్తి శక్తివంతం అని పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ కొనియాడారు. విల్సన్‌రావు రాసిన **'నాగలి కూడా ఆయుధమే'** కవితా సంపుటిని మంగళశారం రవీంద్రభారతి మినీహాల్లో ఆచార్య కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించారు. **ఈ పుస్తకాన్ని ప్రసిద్ధ కవి. కె.శివారెడ్డికి అంకితం ఇచ్చారు.** శివారెడ్డి 80వ పుట్టిన రోజును పురస్కరించుకొని ఆయనను ఘనంగా సన్మానించారు. ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ **'కవిత్వం రాయడానికే పుట్టిన శివారెడ్డి ఎంతో మందిని కవులుగా తీర్చిదిద్దారు'** అంటూ ప్రశంసించారు. కవితా సంపుటి స్వీకర్త కె. శివారెడ్డి మాట్లాడుతూ 'నేనొక ప్రేమ కవిని ప్రేమ కవిత్వం రాయడం కూడా ఒక విధంగా నిరసన వ్యక్తం చేయడమే' అన్నారు. ప్రేమ, అమృతత్వాలు కొమ్మవరపు విల్సన్‌రావు కవిత్వంలో నిండుగా ఉన్నాయంటూ అభినందించారు. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు కవిత్వాన్ని శివాలూగించిన కె. శివారెడ్డి కోటి చంద్రులతో సమానమైన కవిత్వ వెన్నెలను తెలుగు సాహిత్యంలో ప్రసరింపచేశారు' అన్నారు. 'నాగలి కూడా ఆయుధమే' శీర్షిక తనను ఆకట్టుకున్నదని, ఢిల్లీ రైతుల ఉద్యమం ప్రేరణతో రాసిన కవిత్వం కూడా ఇందులో ఉన్నదని అన్నారు. ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఈ కవి ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు పట్ల సహానుభూతి తో రాసిన "తెల్లారితే" కవిత్వంతో పాటు రోహిత్ వేముల ఘటన మీద కవిత్వ స్పందన అతని సాహిత్య వ్యక్తిత్వాన్ని పాఠకులకు పరిచయం చేస్తాయంటే విశ్లేషించారు. నగర సీటీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో కోయి కోటేశ్వరరావు పుస్తక సమక్ష చేశారు. కార్యక్రమానికి హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ తెలుగు ప్రొఫెసర్ దార్ల వెంకటేశ్వర రావు సభాధ్యక్షత వహించగా, ప్రముఖ కవి యాకూబ్, పుస్తక రచయిత కొమ్మవరపు విల్సన్‌రావు జల్ది విద్యాధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

మాయే'..!!

పోకతప్పదు గాక తప్పదు కదా
ఈ లోకంనుంచి..
ఏదో ఒకనాడు అన్నీ విడిచి..!!

భోగాలు వైభోగాలు..
వైభవాలు ప్రాభవాలు..
అంతకుమించిన
సుఖాలు సౌకర్యాలు..!!

అనుభవించే యోగం
తమకున్నంతవరకే కదా ఇవన్నీ..!

దేహం మోహం..
మమకారం అహంకారం..
ఆశలు అత్యాశలు.
దురాశలు నిరాశలు..

ఆవేదనలు ఆక్రోశాలు..
అడ్డు అదుపులు లేని కోరికలు..
ఎన్ని చూసారో..
ఎన్నెన్ని మోసారో..!!

ఏదో సాధించాలని..
ఇంకేదో శోధించాలని..
ఉన్నది ఏదీ సరిపోదని..
వెదికి వెదికి మూటలు కట్టారు..!!

ఉన్నంతకాలం.. నిరంతరం..
నాది.. నాది.. నాదేది..
నాకేదనే వెంపర్లాటలే..!!

ఏం పట్టుకుపోదామనో..?
ఏం కూడా పెట్టుకు పోదామనో..?!

చిట్టచివరికి ఎటు వెళ్ళిపోయారో..!?
ఆ ఏడుకట్ల పల్లకిలో ఊరేగుతూ..!!
ఏటిలో కలిసే
బూడిదగా మారిపోయి..!!

గాలిపై ఆధారపడి చివరికి..
ఆ గాలిలోనే కలిసిపోయేదే ప్రతీ బతుకు !!

ఆ నడకల నీడలే కనబడతాయి..!!
నడపడికల అడుగుజాడలే మిగిలిపోతాయి..!!

-పేరిశెట్టి బాబు
9247170800

అదీ ఇదీ

కోకిలకు నలుపునిచ్చి
తీయని గొంతు ఇచ్చాడు
గులాబీకి అందమిచ్చి
గుచ్చుకునే
ముళ్ళు వుంచాడు!

అందమైన చంద్రునికి
అర్ధ సమయ అందాన్ని
ధగ ధగ వెలిగే సూర్యుడు
భగ భగ మండే గుణం!

ఉన్నతమైన జల సంపద
ఉప్పతనం సముద్రానికి
తడి లేని ఎడారికి
అక్కడక్కడ ఓయాసిస్సులు!

అన్నీ ఇచ్చి ఉన్నోడికి
ఆరగించే శక్తి నివ్వలేదు
ఆకలినిచ్చి పేదోడికి
తగినంత ఆహారాన్ని ఇవ్వలేదు!

చదువుకున్న కొంత మందికి
సంస్కారం లేకుండా పోయే
అధికార దురహంకారికి
ఆక్రందనలు వినబడని అవిటితనం!

ఆనాడు.....
పామును శివుడు తన మెడలో
కాలకూట విషాన్ని తన కంఠంన
కష్టాలను కట్టిపడేసిన వైనం
ప్రజలంతా సురక్షంగా దేవుళ్లకు
మ్రొక్కుతూ!

ఈ నాడు.....
ప్రజలను కష్టాల్లో పడేసే పాలకులు
పాలకులను చూసి
ప్రజలు
భయంగా దూరంగా!

-జగ్గయ్య.జి
9849525802

ఆ.వె. హరిత విప్లవాన్ని భరతావనికి తెచ్చె
స్వామి నాథ యనెడి శాస్త్ర వేత్త
పరికి పంగడాలు విరివిగా సృజయించి
కరవు రక్క సీని పార దోలె..!

ఆ.వె.. అన్న దాత గూర్చి భిన్నంగా యోచించి
గిట్టుబాటు ధర కి పట్టు పట్టె
రైతు బాగు తోనె జాతి ప్రగతి యని
చివరి శ్వాస వరకు పోరు సలిపె..!

ఆ.వె. పంట చేలు కూడ కంట తడి ని పెట్టి
కొత్త వంగ డాలు కుములి పోయె
హరిత మిత్రుడిలను..హతవిధి లేడంచు
అన్నదాత లంత ఖిన్నులాయె...!?
(ప్రముఖ వ్యవసాయ శాస్త్ర వేత్త స్వామి నాథన్ మృతి కి నివాళి గా రాసిన కవిత)

-జి.సూర్యనారాయణ
6281725659.

జీవితం

జీవితం ఒక విచిత్రం..
ఈ జీవిత ప్రయాణం
ఆగమ్య గోచరం!

ఎవరితో ఎవరికి ముడిపడి
ఉందొ..తెలియని సందిగ్ధం.
ఎవరెవరితో ఎంతకాలం
ఉండేదేదో గుర్తెరుగని
సంధి కాలం!

మనమంటే ఇష్టం లేని
వ్యక్తులతో కలిసుంటామా?
మనం ఇష్టమనే వ్యక్తులతోనే
కలిసి జీవిస్తామా
తెలియని తనం!

జీవించినంత కాలం
గొప్పగా బ్రతికామా..
పేరు, డబ్బు, హోదా సాధించామా?
లేక, అవి ఏవి సాధించక సాధారణ
జీవితమే గడిపామా అనేది
కాలానికే వదిలేసిన జీవితం!

ఎలాంటి జీవితం గడిపినా
తోటి వారికి మంచిని పంచుతూ..
అందరి నోట మంచి వ్యక్తిగా
జీవిస్తే చాలు ఈ జీవితానికి అర్థం!
జీవితపు తదనంతరం
అదే పరమార్థం!!

-ఎన్.. రాజేష్
9849335757

తూనీగ

తూనీగ..తూనీగ
మాతో స్నేహం చేస్తావా
చక్కని కబుర్లు చెపుతావా.

తూనీగ.. తూనీగ
మాతో సావాసం చేస్తావా
కమ్మని కథలు చెపుతావా.

తూనీగ.. తూనీగ
మాతో చెలిమి చేస్తావా
తీయని రాగం తీస్తావా.
తూనీగ.. తూనీగ
మాతో మైత్రి కడతావా
చక్కిలిగింతలు పెడతావా.

తూనీగ.. తూనీగ
మాతో సౌఖ్యం చేస్తావా
మాతోనే ఉండిపోతావా

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

గోడ

గోడ నుండి నేను
నా గోడు వినరండి
అడ్డుగా నేనుంటే రక్షణండీ
నాయకులు
చిత్ర కథా నాయకుల చిత్రాలు
వ్యాపార ప్రకటనల కాధారమండీ
పేడ ముద్దలైన
ముద్దుగా భరింతునండి
వెల్లవేస్తే చూడాలి నా అందమండి
గోడ మీద పిల్లి సామెతుందండి
మానవ శునకాల మూత్రశాల నుండి
పాడుబడితే మొక్కలకు ఆవాసమండి
ప్రపంచ వింతల్లో చైనా గోడనండీ
కల్తీ వెల్తీ లేని నిర్మాణ బలముంటే
చారిత్రకంగా నిలిచిపోగలనండి
టెండర్ల కాంట్రాక్టు
అవినీతి అక్రమం
సౌధాలు కట్టడం పేకమేడల తీరు
మేధస్సుతో పాటు
లాభం స్వలాభం పెరిగి
ప్రజాస్వామ్యం కూలిపోతున్నదండి.

-సోమయాజుల సుబ్రహ్మణ్యశర్మ
సెల్: 9346671524

వాన వెలిసిన దృశ్యాలు

అక్కడ అల్లుకున్న
చీకట్లని చీల్చి చూడలేను.

అద్వితీయంగా వెలుగుతున్న
నాలో ఆత్మవిశ్వాసపు దీపాల్ని తప్పా.

ఇలా తలంలో
సంతోషాలు చిగురించాయి చేసినపుడు
ఆనందాలు ఇల్లు కట్టుకోవాల్సినపుడు
మనలోకి చూసుకోవాల్సినపుడు
ఇంకోటి ఆలోచించడమే విషాదం.

సంపాదనకైనా ఆనందానికైనా
హద్దులుంటాయా
నాలో నేను మనలో మనం
ఆనందాన్ని ఆవిష్కరించటం కంటే
గొప్పది ఏముంటుంది.

ఇప్పుడు ఎవర్ని నిందించలేను
ఇప్పుడు ఈ ఏకాంత సమయంలో
ఎవర్నీ ఆహ్వానించలేను.

కళ్ళలోంచి మనో నేత్రాలపైంచి జారే
ప్రకృతి దృశ్యాలు తప్పా
ఏవీ హృదయాల్ని రంజింప చేయలేవు.

వాన వెలిసిన దృశ్యాలతో
కొంత దూరం నడిచి
యోగ ముద్ర లో కూచుని
నాతో నాలో నిండిన క్షణాల్ని
మౌనంగా ఆస్వాదిస్తున్నాను.

-గవిడి శ్రీనివాస్
7019278368,
9966550601

కరవబోయే కుక్కకి చెప్పుదెబ్బ

కథ

అమృత డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతా ఉంది. ఆరు నెలలుగా శ్యామ్ ప్రేమంటూ వెంట పడుతున్నాడు. ఎన్ని విదాలుగా చెప్పినా వినిపించుకోవటం లేదు. ఒకటే వేధింపు. ఒక రోజు ప్రేమించకపోతే ప్రాణం తీస్తానని బెదిరించాడు. అప్పుడే అమృత మెదడులో ఒక ఆలోచన మెరిసింది. ఒక వారం గడువు కావాలంది.

వారం ఎంతలో గడుస్తుంది. ఇట్టే తిరిగి వచ్చింది. "ఏం చేసావ్ మన ప్రేమ వ్యవహారం" అడిగాడు శ్యామ్. "ఇప్పటికెప్పుడు నేను ప్రేమించడమంటే ఎలాగ? ఓ పని చేద్దాం. కొద్ది రోజులు ఇద్దరం కలుసుకుంటూ ఉందాం. నెమ్మదిగా నీ మీద ప్రేమ పుడుతుంది" అంది అమృత. ఇదేదో బాగుందనుకున్నాడు శ్యామ్.

ఆ మరుసటి రోజు నుండి పార్కులో ఇద్దరూ కలుసుకోవటం. కాసేపు కబుర్లు చెప్పుకోవటం ప్రారంభమైంది. అలా వారం గడిచింది. ఆ రోజు ఆదివారం. పార్కులో కాస్తంత దూరంగా కూర్చున్నారు. శ్యామ్ చెప్పే కబుర్లు వింటూ వుంది అమృత. ఇంతలో వాకింగ్ చేసే జనం పెరగడం, అటువైపుగా రావడం గమనించిన అమృత, తను ధరించిన టాప్ వస్త్రాన్ని కాస్త చించి.. బాబోయ్.. బాబోయ్.. అంటూ అందరికీ వినిపించేలా అరిచింది. ఏముంది..నలుగురు చేరే సరికి శ్యామ్... అమృత నోరు మూస్తున్న దృశ్యం కనిపించింది. శ్యామ్‌కి దేహశుద్ధి జరిగింది. ఇద్దరు కానిస్టేబుళ్ళు వచ్చి శ్యామ్‌ని స్టేషన్‌కి లాక్కుపోయారు.

- ఎస్.ఆర్. పృథ్వీ
సెల్:9989223245

'అనంత' సాహిత్య సాంస్కృతిక వేదిక

అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక వికారాబాద్ వారం వారం నిర్వహిస్తున్న వాట్సప్ కవిసమ్మేళనంలో భాగంగా ఈ వారం 'రైతు దినోత్సవం' శీర్షికలో వచ్చిన కవితల్లో మేలైనవి కొన్ని..

నిర్వాహకులు -కమలేశ్
-దోరవేటి, అనంత వ్యవస్థాపకులు

రైతు

పొద్దున లేచినది మొదలు
దిద్దగ వలెనన్న పనుల దీవస మొకటే !
పద్దతి నేర్పుడి రైతుల
వద్దకు నెపుడైన జేరి వార్తము గూరున్!

-మల్కనెల్లి లాల్ రెడ్డి

రైతు ఘోష!

మూడు కాలాలు
భూతల్లిని పచ్చపచ్చగవుంచే నీకు
ఎందుకయ్యా ఇన్ని ఇబ్బందులు!
పస్తులుంటూనే
లోకం కడుపునింపాలనుకునే
నీ కెందుకయ్యా ఇంత తిప్పలు!
నోటికాడి బుక్కను గద్దదన్నుకపోయినట్టు
పండిచ్చిన పంటతో
నాలుగు రూకలను కండ్లజూద్దామనుకుంటే
మూడుపూటల ఇల్లెల్లదీసుకుందామనుకుంటే
కాలానికి సాతియ్యని
ఈ అకాల వర్షాలు
నిన్ను నిలువునా ముంచేస్తే
పాపకారి దేవునికి
గిదంతా గనవడ్డలేనట్టున్నది!
ఇంకా ఎంత ఘోషవెద్దామనుకుంటుండో!
రైతన్నా!
ఎన్నడు మారాలి నీ తలరాత!
ఎప్పటికి దప్పాల నీ ఎట్టిశాత?!!

-సుప్పని సత్యనారాయణ.
9492626910.

రైతన్న

మచ్చుకైనా
మబ్బులు కానరాని చోట
నేల మీద
నీటి చుక్క ఉనికెక్కడిది
అందుకే ...
మొక్కలకు ప్రాణం పోయలేక
మట్టితల్లికి
ఏడుపే మిగులుతుంది

రైతన్నల వేళ్ళు
నోట చేరుటకు కష్టమౌతుంది
శ్రమ జీవులు
పొట్ట చేత పట్టుకొని
వలసలు పోతుంటే
పల్లె తల్లి
ఒంటరినౌతానేమోనని
విలపిస్తుంది
పిల్లల ఆకలి కేకలతో
తల్లుల హృదయాలు
దుఃఖ సాగరమౌతున్నాయి
ఖాళీ కడుపుల మంటలు
గంజినీళ్ల కోసం
వెతుకుతున్నాయి
రైతు లేని దేశం
నీతిలేని భాష్యం
నీరు లేని ఊరు
కన్నీటి వరదల తీరు

-సంజి.మల్లేష్
9542628014

అంజలింతు

తొలకరి జల్లుఁజూసి బహుతోషమునన్ దమ కాడితాళ్ళతోన్ !
బితెలతెలవారగాన్ బయలు దేరుచు నీక్షితి మాతదాసులై
బివలపల దాపల్లందు నిరువైపుల నెద్దుల జోడుఁగట్టియున్
బిహలములుఁ బట్టు రైతులకు హ్లాదము తోడుత నంజలించెదన్

-సంజీవి

మణిపూసలు

రైతంటే భీముడు
రైతంటే సోముడు
ఈ విశాల జగతికి
రైతంటే దేవుడు!

రైతు లేక వృద్ధి లేదు
తినడానికి సద్ది లేదు
భూమ్మీద బతుకుతున్న
జీవులకిక సిద్ధి లేదు!

రైతు లేని ఊరుందా?
రైతు లేని వాడుందా?
ప్రపంచాన ఎక్కడైన
రైతు లేని చేనుందా?

ఎండలకు ఎండిపోయి
వానలకు నానిపోయి
కష్టపడును కదా రైతు
చలిపులికి వణికిపోయి!

అహర్నిశలు శ్రమియించి
స్వేదఝరిని పారించి
పంటలు పండించు రైతు
ప్రకృతిమాత సర్థించి!

రైతంటే రాజంట
స్వాతంత్ర్యం లేదంట
ఈ మాయలోకంలో
బలిపశువే తానంట!

-వడిచర్ల సత్యం
9441350137

అన్నదాత

రైతే జగతికి మూలము
రైతే యన్నంబు బెట్టు రాజిత మొప్పన్!
రైతుకు నండగ యుండుము
రైతే నిజమైన గొప్ప రాజొ ధరలో!

హలమున్ చేతను బట్టియు
పొలమున్ దున్నేడి రైతు పుడమిన ఘనుడై
గలగల పంటల రాసుల
ఫల సంపద వృద్ధి జేసి భాగ్యము బెంచున్!

ఏ కాలము నందైనను
ప్రాకటముగ పొలము దున్ని పంటను దీసీ
యాకలి తీర్చెడి ఘనుడా!
నీ కెవ్వరు సాటి లేరు నిక్కము భువిలో!

రతనాలను పండించుచు
బ్రతుకంతయు ధారపోసి బానిస వోలెన్
సతతము నప్పుల సుడిలో
గతి గానక చిక్కుకునెను కానగ రైతున్!

అన్నము బెట్టెడు వానికి
మున్నన కరువాయె భీతి మనసున కలుగన్
యెన్నడు తీరును కష్టము
కన్నీటికి యంతమేది గావుము రైతున్!

-మహ్మద్ షరీఫ్
సంగారెడ్డి

కొలువు కాదు

చినుకు బడ్డదటంచు చిరుధాన్యములు దెచ్చి
నేలలో దాచెడి నేర్పువాడు
మొలకలై జనియించు మోమును ముద్దాడి
కన్నబిడ్డల వోలె కాచువాడు
పశుజాతి కసవని పంట మేసిన గాని
కంచెను సుట్టు నిర్మించనోడు
విరగ గాసిన పంట పరదృష్టి పడకుంట
దిష్టిబొమ్మ నిలుప దిరుగు వాడు.

కాడితో నొక్క పూటను గడువు వాడు
కలుపుదీయగ నొకపూట కొలువుకాడు
మట్టితో నిత్యమాడెడి మానవోత్త
ముడు గలడటన్న నితడేను ముదమిదేను

-కమలేశ్
9160396596

నాయ్న కత

మా ఊరి విరులు కూలికోతున్నారు
మా ఊరి వీరులేమో
తాగి కూలిపోతున్నారు
మా ఊరును కన్న చెరువు మాత్రం
రాత్రంతా మేల్కొని దూపగొన్న
పంటపొలాలకు పాలిస్తుంది!
ఉదయానికి జాజుపూత పూసి
నోరులేని ఎడ్లను,
మేకలను తెలుగు పద్యాలు చేసి
చేనుదాక పాడుకుంటాడు నాయన!
పల్లవులపై చరణాలపై కొడవలిని నూరి
చేన్లొ కలుపుతీస్తాడు!
మాట వినని మొండిరాళ్లతో కుస్తీపట్టీ
చేనుకు చెమట తూడ్చి లాలపోస్తాడు
అప్పుడప్పుడూ అతిథిలా వచ్చే
వానచినులకు కాల్వలు తీసి
చేనును బతుకమ్మపనం చేస్తాడు.

నెత్తిమీద సూర్యుడు ఆకలిగంట
కొట్టగానే
నానబెట్టిన గట్టిరొట్టెలను దవడకేసి
పొద్దుమూకిదాక గుంటుక కడ్తాడు!.
చీకటి కాగానే జగ్గాలులేని
పశువులు చుక్కలవెలుగులో నాయ్నను
ఇంటిదాక నడిపిస్తుంటాయి!
ఊరు కట్టుకున్న కన్నీటికొండలను
పలకరిస్తూ
ఏ అర్ధరాత్రి వరకో నాయన చెప్పే
పండగలనాయన్న కథను
ఆకాశంలో చుక్కలు కూడా
నాల్గుకాళ్ళ
మంచమేసుకొని వింటాయి!.

-చిగురాల్ పల్లి ప్రసాద్

నీవుసల్లగుండాలె!

రైతన్నా!..నిజంగా నీవు రాజువన్నా...
మంచిచెడులకు సాక్ష్యం నీవేకదన్నా!
ప్రకృతి వైపరీత్యాలనెదుర్కుంటూ
కాలం కరుణిస్తే కష్టించి పనిచేస్తూ
పంటపండించి పదిమందిని ఆదుకుంటావు.
కరువుకాలంలో కన్నీటితో సైతం
తోటివాడికి తోడై నిలవాలని
నీవెంతో ఉబలాటపడతావుకదన్నా!..

'అన్నదాత సుఖీభవ' అంటారుగానీ,
రైతుబాగు కోరుకుంటారా ఎవరైనా!?
అన్నం దానం చేసినవాడు కాదు దాత,
కాయకష్టంచేసి తన కడుపుమాడ్చుకొని
కష్టజీవుల ఆకలితీర్చేనీవు...
నీవేనన్నా దాతవు
దానకర్ణుడి అన్నవు.
పాలకులేనాడూ నీపై పక్షపాతం చూపొద్దు.
నదీజలాలనందించ ప్రణాళికలు చేస్తూ

అందరికన్న మన అన్నధాతే మిన్నంటూ
అహర్నిశలు నీకు తోడుగా నిలవాలి.
'నీవు సల్లగుంటే దేశమంతా సల్లగుంటది.
నీ కన్నీళ్లు మా అందర్నీ బాధపెడ్తది'
కర్షకుడేకదా కరుణామయుడు.
ధాన్యం పండించేవాడే ధర్మాత్ముడు.
రై?తేరాజు... అతడు లేకుంటే
గడవదు'ఒక్కరోజు.

-అవుసలి ఆంజనేయులు
వెల్చాల్

కృషీంద్రుడు

హలము చేతబట్టి పొలముదున్నెడి
భూ పుత్రుడు మన రైతు
అన్నపూర్ణయై నిల్చి
అవనియందు విశ్రాంతి లేకున్నా
విసుకుచెందకుండా
క్షామము లెన్ని వచ్చినా
శాంత గుణముచేత
సేద్యాన్ని క్రతువు చేయును రైతు
కష్టమే తన కన్నతల్లియనుచు
ఇష్టలెన్నో చంపుకొని
అందిస్తారు పసిడి వర్ణపు ధాన్యరాశులను
మాగాణిలో కలుపు తీసే
కలమ్యం యెరుగని రైతన్నకు పొలమే దేవస్థలం.
హలమువంటి ఆభరణాలే పూజసామాగ్రి
పండించిన పంటనే పరమాత్ముడై
సమస్తలోకమునకు
సుఖాలను కలిగించే
రైతే మన రాజు

-అనురాధ సురేష్
9177253505

రైతురా...

రైతురా మన రైతురా
తాను రాలిపోతు విత్తెమొలకెత్తురా
అన్నమై యాకలినార్పురా
మాయదారి మబ్బులు ఆశలరెక్కల
తెగనరికినా
చేతికొచ్చిన పంటను
పడగండ్ల వానొచ్చి
కడగండ్లు మిగిల్చినా
నమ్ముకున్న భూతల్లికి సేవచేయ
నడుంగట్టే సైరికా
నీకు రారు సాటియెవరు
పంటపొలము ప్రాణముగా
కాడెద్దులె నీ యనుబంధంగా
దుక్కి దున్ని ధాన్య రాసులు
గాదెల నింపే నవాబువు
అప్పుల కుప్పలు పైనపడి
నలిగిపోవు గరీబువు
కోట్లాది పిల్లలు మెతుకులకై
యెదురు చూచు చుందురు
నా జాతి జీవనాడి నీవు
చద్ది మూట విప్పేడమే తప్ప
ధనరాసులు పోగేయుట తెలియవు
నారబట్టలే తప్ప నాణ్యమైన బట్టలెరగవు
వ్యవసాయము చేసిరి యమపాశము
దళారీ మిడతల దండుకు బలై పోయిరి
అమ్మవోతే అడవి రీతి
కొనవోతఘ కొరివి రీతి
దోపిడీకి గురి యయ్యెను
దగా పడిన బ్రతుకురా
అతుకుల బొంతరా
అయినా వృత్తిని నమ్మిన
నిస్వార్థ మానస మౌనివి

-ఆకుల మల్లికార్జున్
7416067335

ఆహార సృష్టి కర్త

వ్యవసాయం అనే పదం లోనే
సహాయం ఉంది
అగ్రికల్చర్ అనే మాటల్లోనే
కల్చర్ ఉంది
విశ్వానికి కల్చర్ ని
సహాయం చేసే గుణాన్ని నేర్పిన
ఒకే ఒక స్ఫూర్తి రైతు
ఆయన లేనిదీ విశ్వం మిథ్య
తను ఎండినా
తనువు చాలించే వరకు
దుక్కిని నమ్మే
ఆశకు నిలువెత్తు నిదర్శనం
రైతు దేశానికి వెన్నెముక
సకల జీవరాశుల మనుగడ
వ్యవసాయం దండగ కాదు
అది ఒక పండుగ కావాలి

-ఉమాశేషారావు

యుద్ధ విషాదం

ఉన్మాదం
పుక్కిలించిన
ఉక్రోశమే యుద్ధం
వేల తలలు
నెత్తురోడితే
పూల కలలు కాలిపోతే
స్వప్నాలు శిథిలాలైతే
ప్రాణాలు ఆవిరైతే
నివాసాలు స్మశానాలైతే
అదే యుద్ధ విషాదం
మృత్యువై కబళించే భయోత్పాతం

- డా. తిరునగరి శ్రీనివాస్
8466053933

చదువు

కథ

సింగరాయి అనే గ్రామంలో వీరయ్య, రాజేశ్వరి అనే పేద దంపతులు ఉండేవారు. వారికి చాలా కాలం తర్వాత ఒక కూతురు జన్మించింది. ఆ కూతురుకి రాణి అని నామకరణం చేశారు. కొద్దిరోజుల తర్వాత వీరయ్య చనిపోవడం జరిగింది. రాజేశ్వరి కూతురు రాణిని అల్లారుముద్దుగా పెంచసాగింది. రాణి పాఠశాలకు వెళ్లి చదువుకుంటూనే సెలవు రోజులలో తల్లి రాజేశ్వరితో కూలీ పనులకు వెళ్లి సహాయపడేది. తల్లి రాజేశ్వరి ఎంత చెప్పినా కూలీ పనులు చేస్తూనే రాణి చదువుకుంటూ మంచి పేరు తెచ్చుకుంటుంది. చదువులలో, ఆటలలో కూడా రాణి మొదటగా నిలుస్తూ ఉండేది.

-రాణి తమ ఊరిలోనే పదవ తరగతి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత పొందింది. గ్రామస్తులందరూ రాణికి పెండ్లి చేసి ఒక అయ్య చేతిలో పెట్టుమని రాజేశ్వరికి ఎంతగానో చెప్పసాగారు. కానీ రాజేశ్వరి మాత్రం పట్నంలో రాణిని పైచదువులు చదివించింది. రాజేశ్వరికి ఎంత కష్టమైనా పనులు చేస్తూ రాణిని చదివిస్తుంది. రాణి కూడా బాగా చదువుకొని మంచి ఉద్యోగంలో చేరింది. రాణి ఉద్యోగం చేస్తూనే పట్నంలో ఇల్లు తీసుకుని, తల్లి రాజేశ్వరిని చక్కగా చూసుకోసాగింది. రాజేశ్వరి కష్టపడి కూతుర్ని పెంచడం. రాణి చక్కగా చదువుకొని ఉద్యోగం చేయడం తెలుసుకున్న గ్రామస్తులు కూడా ఆడపిల్లలకు చిన్నతనంలో పెండ్లి చేయడం మాన్పించి, ఆడపిల్లలను పట్నంలో పైచదువులు చదివించసాగారు.

-యస్. రేణుక,
ఎనిమిదవ తరగతి
జిఖఉూ హవేలీ ఘనపూర్
మెదక్ జిల్లా
6302411016

పట్టుదల

కథ

అనగనగా ఒక ఊరిలో రామయ్య, లక్ష్మమ్మ అనే దంపతులు ఉండేవాళ్లు. వారికి రాకేష్ అనే కుమారుడు, రవళి అనే కుమార్తె ఉన్నారు. వాళ్ల కుటుంబం చాలా నిరుపేద కుటుంబం. తండ్రి రామయ్య ఆరోగ్యం ఎప్పుడూ బాగుండేది కాదు. వారికి ఉన్న అర ఎకరం పొలంలో కేవలం లక్ష్మమ్మ మాత్రమే పనిచేసి, కుటుంబాన్ని పోషించేది. తల్లిదండ్రుల పరిస్థితి మూలంగా రాకేష్, రవళిలు సరిగా చదవడం లేదు. అలాగే రవళికి నృత్యం అంటే ఎంతో ఇష్టం ఉండేది. ప్రతి పాటకు కొత్త రకంగా నృత్యం చేస్తూ రవళి అందరినీ ఆకట్టుకునేది.

ఒకసారి పాఠశాలలో జరిగిన నృత్య పోటీలలో పాల్గొన్న రవళి మొదటి స్థానంలో నిలిచింది. అలాగే రవళి నృత్యాన్ని పట్టుదల చూసిన డ్యాన్స్ మాస్టార్లు రవళికి నృత్యంలో మెలకువలు నేర్పిస్తారు. రవళి చదువుతూనే నృత్యం చేస్తూ మంచి పేరు తెచ్చుకున్నది. పదవ తరగతి పూర్తి చేసిన రవళి ఇంటి వద్దనే విద్యార్థులకు నృత్యం నేర్పిస్తూ డబ్బులు సంపాదించసాగింది. ఆ డబ్బులతో కుటుంబాన్ని పోషించడమే కాకుండా, రాకేష్ ను చదివిస్తూ గొప్ప డాన్స్ మాస్టర్ గా రవళి పేరు తెచ్చుకుంది. మొదట్లో రవళి నృత్యం చేయడం తల్లి లక్ష్మమ్మకు నచ్చకపోయినా కష్టపడి అందులో ప్రావీణ్యం పొంది చిన్నారులకు నేర్పిస్తుండడం చూసి లక్ష్మమ్మ ఆనందపడింది. పదిమందికి ఉపయోగపడే నృత్యం అందిస్తున్నందుకు రవళికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

నీతి: చదువుతోపాటు వివిధ ప్రక్రియలలో పట్టు సాధించిన గొప్ప లక్షణం అవుతుంది

-యం. అక్షయ
ఎనమిదవ తరగతి,జడ్‌పిహెచ్‌ఎస్
హవేలీ ఘనపూర్,మెదక్ జిల్లా
9959730286



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1028వ రోజు 'తన కోపమె తన శత్రువు'అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'తన కోపమె తన శత్రువు' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా సమర్పిస్తున్నాం.

-సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

సమత జలధారల్లో...

మాటే మనిషికి భూషణం

మాటే మనిషికి ఆభరణం.
మంచి మాట
సుగంధాలు వెదజల్లే పరిమళం
సరస సల్లాపాలే మల్లె పూదండ
నిర్మల హృదయ నిధిలో హంసరాజం.
లోకులు లోభం వశవర్తులయ్యాకే
కాకి బలగం గుణం చేజారిన ముంత
అహం కండువా కప్పుకుని
తప్పులో కాలేసాక
మానవీయ విలువలకు తిలోదకాలు.
సమర్థించుకునే ముళ్లదారుల్లోనే
కోపం కిరీటం ధరించి
దానవత్వానికి దాసోహం
ఒక్కో సుగుణం
పూలరేకుల్లా రాలుతుంటే
అరిషడ్వర్గాల మెట్లెక్కుతూ
వెనక్కి చూడని పయనం.
ధర్మాగ్రహం మంచిదే
మానవతాతత్వ దీపం వెలిగిస్తుంది
చక్కని సోయిలోకి తీసుకురావడానికి.
పగిలిన గాజుపెంకులు
తుచ్ఛమైన కోరికలు
అందులో ఏ ప్రతిబింబం సాకారం కాదు
అవలక్షణాల మనసు తొలగించి చూడు
మమతా సమతా జలధార పొంగుతుంది.

- ఏడెల్లి రాములు

అసమర్థులు

సూర్యోదయం మొదలు

ఎన్నో రకాల జీవిత సమరాలు
విభిన్న మనస్తత్వాలున్న
వ్యక్తులతో సవ్యసాచిలా
శక్తి కలిగి సమర్థించే
శాంత స్వభావం ఉండాలంటే కష్టం
అహంకారం
అధికారం
మనిషి చుట్టూ వైఫెలా
ఎవరికీ ఏమీ చెప్పలేక
అసమర్థత వల్లే కోపం
కారం తక్కువ తిని
మమకారం పెంచుకుంటే
కొంత ఉపశమనం
తన కోపం
తన ఆరోగ్యానికి ఎంతో హాని
రక్త నాళాలు వేడెక్కి
నరాలు ఉత్తేజ పడి
రక్త ప్రసరణలో అసమతుల్యత

చుర్రు!

తనకోపమే తన శత్రువు

తనకే అపకీర్తి అవమానం
సుమతీశతకకారుని సత్యం
నిత్యం అవశ్యం అనుసరణీయం.
చిర్రుబుర్రులాడే
దుర్వాసముని
విశ్వామిత్రుడు
కోపించి ఏం సాధించారు?
వేములవాడ భీమకవి
ఎగతాళి చేసిన వారిపై కోపంతో
"అప్పాలన్నీ కప్పలు కావలె"
అనగానే బెకబెకలు విస్తళ్లలో
దుర్యోధనుడి ద్వేషం
అసూయతో రగిలి రగిలి
సెగలై కౌరవనాశనం.
ధుమధుమలాడే
కోపిష్టి భర్తకిచ్చే సలహా
"కోపం వస్తే నా సిగకోయి మగడా!"
అన్నంలో వెంట్రుక వచ్చిందని
ముక్కు కోయబోయిన మూర్ఖుడికి
తెలివిగల తరుణి చాతుర్యం.
ముక్కు మీద కోపం
ముఖానికి అందం
సత్యభామ కే
అందరూ చిటపటలాడితే
భూలోకంలో యమలోకం.
అత్త మీద కోపం
దుత్త మీద చూపితే
సంసారం నాశనం
ఆఫీసులో చూపితే తాఖీదులు
బడిపిల్లలను చితకబాదితే
పోలీసు తాఖీదులు.
మార్కుల ఒత్తిడితో
ఆత్మహత్య చేసుకుంటే
మెడకి నాగుపాము.
చెరువు మీద అలిగితే
చెడేది మనమే
ఇతరుల్ని కాల్చి
వాత పెట్టాలనుకుంటే
ఆ చురకలు
వాతలు మనపైనే.
మన అలసత్వం
సొంబేరుతనం
కోపానికి కారణం
హమేషా నరమ్ నరమ్!
కభీకభీ గరమ్
శీతాకాలంలో వెచ్చని స్వెట్టర్
కోప నిగ్రహం.
నచ్చకున్నా
అధికారులకు సలాంకొట్టు
నోరు మెదపకు!
గటగటమంచినీరు తాగి
ఒంట్లు లెక్క పెట్టు
మానసిక నిపుణుల సలహా.

-ఎ.రాజ్యశ్రీ

అంతరంగ స్వరూపం

జన్మతః మనిషికి
ద్విభాష్యాలు
ఇది శాస్త్ర పరిజ్ఞానం
ఒకటి అంతర్ముఖం
రెండు బాహ్యం!.
కానీ
రెండూ ఒకదారీ కాదు
వైరుధ్యహేతువులు
లేదా ప్రాణులు!
మనసు అనే అశ్వాన్ని
పగ్గాలేసి పట్టి బంధిస్తే
మనుగడకు భాష్యం
దివ్యం, అపురూపం !
కానీ
వస్తుతః ఈర్ష్యాళువు.
జుగుప్సాపరులు అధికం
జీవితాల భస్మీపటలానికి
కారణభూతులు !!
అందుకే తన్ను తాను ఎరిగి
తన తప్పులు తాను.
సవరించుకునే అవకాశాన్ని
సద్వినియోగపరచుకొని
పదిమందికి ఉపయోగపడే.
మార్గాన్ని ప్రసాదించాడు
ఆ భగవంతుడు
పెద్దమెదడు భవ్యం
ప్రలోభాలకు లొంగక
మనసులో దాగి ఉన్న
భావానికి
కావా నీవు
అపర పరమాత్మ స్వరూపానివి
ఓ జ్ఞానీ
నిరూపించుకునేందుకు
నీకు సదవకాశం
ఆవేశ సమయం
కోపాన్ని నిగ్రహించు
సహనాన్ని ప్రదర్శించు!.

-కె.కె.తాయారు

శరీరం నీరసించి
ఆలోచన లేక
అసహాయ స్థితి
కోపం వస్తే
తన పేరును తలచి
మంచిగా ఉండాలి అనుకోవడమే
కొందరు అంకెలు లెక్కించి
స్వస్థత చెందాలి అంటారు
ఏది ఏమైనా
అసమర్థత వల్లే
విజయం దూరం
సాధన శోధన పరిశోధన యోగ
మనిషి కి జ్ఞాన శక్తి కల్గిస్తాయి.

-నారుమంచి వాణీ ప్రభాకరి

నీలోనే వుంది

నిజం అక్షరాల నిజం

అది మనలోనే ఉంటుంది
మనతోనే ఉంటుంది
మననే దహించి వేస్తుంది
కోపం మన శత్రువు
శాంతం సహనం
కోపానికి శత్రువు
శాంతం సహనంతో
జీవితం తృప్తి కరం
అసూయ జనితకోపం
జీవితానికి వేసే ముళ్ల బాట
కోపంతో కుటుంబాలే బలి
ప్రేమ రాహిత్యకుటుంబం
అందరికీ నేనంటే హడల్ అనే భ్రమ
హడల్ కాదు
నిన్ను నీకోపాన్ని
ఎందుకు భరించాలనే జాగ్రత్త
భ్రమలే
నిర్దిష్ట లక్ష్యాన్ని
మళ్ళించే శత్రు మూ కలు
కోపాన్ని నువ్వు కోపగించుకో
అదుపులో పెట్టుకో
అందరితో ఆత్మీయంగా మసలుకో,

-మోటూరి శాంతకుమారి

తన కోపమె తనశత్రువు

తన కోపమే తన శత్రువు

తన శాంతమే తనకు రక్ష
ఆనాడే చెప్పాడు
సుమతి శతకంలో బద్దెన
కోపం శత్రువులను కొనితెస్తుంది
బలహీనులకు కోపం ఎక్కువ
తాను తలచింది తలకిందులైనా
రుసరుసలాడుతు బుసకొడతారు
ఆవేశం చల్లారితే తలపట్టుకొంటారు
కోపం అన్నిరకాలుగా హాని
మిత్రులు శత్రువులుగా మార్పు
ఆరోగ్యం పాడు
అనర్థాల హేతువు
బంధాలు విడిపోతాయి
బంధుత్వాలు తెగిపోతాయి
నోరు మంచిగుంటే
ఊరు మంచిగుండు అన్నారు పెద్దలు
మనస్సుకు నచ్చకున్నా
ఉద్రేకం పనికి రాదు
అది ఉపద్రవాల కారణం
పరిస్థితులకనుగుణంగా
మసలుకుంటే
సగం సమస్యలు దూరం
మనస్సును నియంత్రించుకుంటే
ఆవేశం అదుగంటి పోతుంది
కీలెరిగి వాతపెడితే
సమస్యకు పరిష్కారం
శాంతమూర్తులుగా ఉండాలి
కోపాన్ని దరిచేరకుండా చూడాలి
నిస్సహాయతను వదలాలి
నిమ్మలంగా ఆలోచించి చేయాలి
మనస్సు అదుపులో ఉంటే
మమతలు వెల్లివిరుస్తాయి
శత్రువులు తగ్గి
మిత్రులు పెరుగుతారు
మానసిక ప్రశాంతత పెరిగి
ఆరోగ్యం మెరుగైపోతుంది.

-గుండం మోహన్ రెడ్డి

శాంతిమంత్రం

మండుటెండ
వంటి కోపాగ్ని
మంచిమాటల నీరు
చల్లితే శాంతించు!.
ముక్కుమీద కోపం
తెస్తుంది మొదటికే మోసం!
వృత్తి, ఉద్యోగాల నిర్వహణకు
చేస్తుంది చేటు!
ఆరోగ్యంపై వేస్తుంది వేటు!
పచ్చని కాపురాలలో
పెడుతుంది ఆరని చిచ్చు!.
ఒకరు ఆగ్రహిస్తే
మరొకరు మౌనం
వహించటం
సర్దుబాట్లతో సంధి
జరగడమే శాంతిమంత్రం!.
మాటల యుద్ధాలకు
ముగింపు పలకాలంటే
శాంతిగంటను మోగించాలి!.
అకారణ కోపం
అంతర్గత శత్రువు
ఆరోగ్యాన్ని
హరిస్తుంది!.
తన శాంతమే
తనకు రక్ష
ఇలలో
సంతోష స్వర్గాన్ని సృష్టిస్తుంది!.
శాంతము లేక సౌఖ్యమేది?!
మానవులంతా మైత్రితో
మసలినానాడు
జగమే కాదా శాంతివనం!.
కోపం వచ్చినప్పుడు
మౌనమే శ్రేయోదాయకం!
కోపం ఆరోగ్యానికి హానికరం
అది తెలుసుకున్నవాడే జ్ఞాని!.
వ్యక్తిగత శాంతే విశ్వశాంతి
సానుకూల ప్రకంపనల
శాంతిమంత్రం
పఠించాలి ప్రపంచమంతా ఒక్కటై!.

వెంటాడుతుంది

కోపగించువేళ కోతిగాగనిపించు
తాపమందునపుడు తగని తిక్క
మేలుజేయలేరు తాలుబుద్ధిని గల్గి
పనికిరానివారి పంతమిట్లు!.
ఎర్రబడినమోము చుర్రుమనెడిచూపు
కర్రుగాల్చిపెట్టు కఠినభాష
కన్నతల్లికైన కన్నీరునొలికించు
బుద్ధి గడ్డిదినుచుబూకరింపు!.

-ఎం.వి.ఉమాదేవి

సహనం

ఈర్ష్య, ద్వేషం, పగ త్రిగుణాలు

స్వార్థానికి ముఖ్య కారణాలు
గర్వం వలన వచ్చే గమనాలు
సహనాన్ని కోల్పోయే సుగుణాలు.
రామాయణంలో రావణుడు
గర్వభంగంలో పరశురాముడు
ఆవేశంలో దుర్వాసుడు
సహనాన్ని కోల్పోయే సామాన్యుడు.
కోపం అనర్థదాయకం
కఠినత్వం అహంకారదాయకం
అనుమానమే పెనుభూతం
సహనాన్ని కోల్పోయే కారకం.
ఆకలితో శపించబోయిన
వ్యాసమహర్షి
అనుమానంతో శపించిన
గౌతమమహర్షి
అహంకారంతో
రగిలిపోయిన విశ్వామిత్రమహర్షి
సహనాన్ని కోల్పోయిన మహర్షులు.
చిన్నదానికి చిర్రుబుర్రులాడడం
చెప్పినమాటలు వినడం
ఒకరిపై తిక్క మరొకరిపై చూపడం
ద్వేషాభావంతో సహించకపోవడం
అధికార బలంతో విర్రవీగడం
ఆర్థిక మదం పెరిగిపోవడం
శాంతియుత సహనాన్ని కోల్పోవడం.
తనకోపమే తనశత్రువు తెలుసుకో
తనశాంతమే తనకు రక్షని మసలుకో
తన దుఃఖమే తనకు సరకమని
నమ్ముకో
సహనాన్ని కోల్పోవడం మరిచిపో.

-గుండవరం కొండల్ రావు

సంఘీభావంతో మానవ సమస్యలకు సమాధానాలు

పేదరికం, ఆకలి కేకలు, అవిద్య, ప్రజారోగ్యం, అసమానతలు లాంటి సమస్యల పరిష్కారానికి మానవ సమాజం ఏకం అవుతూ, వాటిని తరిమేయడానికి 8 బిలియన్ల ప్రపంచ జనాభా ఏకతాటి మీదికి తీసుకురావడమే పౌరసమాజ కనీస లక్ష్యం కావాలి. సమాజ అవసరాలు తీర్చడం, ఏకాభిప్రాయంతో చేయూతను అందించడం, ప్రయోజనాలను పొందడం, పేదరిక భూతాన్ని తరిమేయడం, సమాజ శ్రేయస్సు ఫలిచడం లాంటి అంశాల పట్ల మానవ సమూహాలు సమైక్యంగా పోరుచేయడాన్ని సంఘీభావంగా అర్థం చేసుకోవాలి. ఐక్యత, సామరస్య సూత్రాలను ప్రకటించిన ఐరాస 'మిలినియం డెవలప్‌మెంట్ గోల్స్' సాధనలో ప్రపంచ మానవ సంఘీభావం ఎంతో ఉపకరిస్తుందని అభిప్రాయపడుతున్నది. అంతర్జాతీయ ఐక్యత, సమన్వయాలతో ప్రపంచ సమస్యలను అధిగమించడానికి అవసరమైన సమిష్టి కృషిని చర్చించడానికి 2005లో ఐరాస తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రతి ఏట 20 డిసెంబర్‌న ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ మానవ సంఘీభావ దినం (ఇంటర్నేషనల్ హ్యూమన్ సాలిడారిటీ డే)" పాటిస్తూ ప్రపంచ సమస్యలకు, ప్రధానంగా పేదరికానికి సమాధానం వెతికే క్రమంలో ఏకతాటిపైకి వచ్చి సంఘీభావం చూపడానికి దీనిని వేదికగా ఉపయోగిస్తున్నారు.

అంతర్జాతీయ మానవ సంఘీభావ దినం-2023 నినాదం:

అంతర్జాతీయ మానవ సంఘీభావ దినం - 2023 నినాదంగా "మార్పు కోసం పోరు (అడ్వొకేట్ ఫర్ ఛేంజ్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతుంది. దేశాల సరిహద్దులు మరిచి ప్రపంచాన్ని కుగ్రామంగా తలచి సోషల్ మీడియా, ఎన్‌జిఓలు, పౌరసమాజం వేదికగా పేదరిక నిర్మూలనకు సంబంధించిన అంశాలను, సలహాలను, సూచనలను, సహాయాలను, అవగాహనను, సమిష్టి ప్రయత్నాలను, అసమానతలు/పేదరికాలను రూపుమాపడం లాంటి అంతర్జాతీయ స్థాయి ప్రయత్నాలకు ఈ వేదిక ఆస్కారం ఇస్తున్నది. మానవ హృదయం సహానుభూతిని శాశ్వత ఆభరణంగా ధరించి సమన్వయంతో తోటి సమాజ ఉన్నతికి ప్రతిన బూనాలని పిలుపు ఇస్తున్నది.

సమస్యల పోరుకు సంఘీభావంతో సంఘటితం కావాలి:

సంఘీభావమే సమాజ పురోగతి, సంక్షేమ స్థాపనలకు ఊతమిచ్చే ఇంధనం కావాలి. రేపటి అభివృద్ధి చెందిన మానవ సమాజ నిర్మాణమే లక్ష్యంగా సమస్త ప్రజానీకం సంఘీభావం ప్రకటిస్తూ సమాధానాలు వెతకడమే తమ నిత్య మంత్రం కావాలి. మన ముందు కర్కశంగా కరాళనృత్యం చేస్తున్న పేదరికమే మన ప్రథమ శత్రువు అని భావించి, దానిని తరిమేయడానికి అందరం చేయి చేయి కలిపి, గళం విప్పి సంఘీభావంతో సుదీర్ఘ పోరు చేస్తూ మెరుగైన ఫలితాలను సాధించడమే అంతర్జాతీయ మానవ సంఘీభావ దినం వేదికను లక్ష్యంగా వాడుకోవాలి. వైవిధ్యభరిత అంతర్జాతీయ సమాజంలో మానవీయ కోణంతో తోటి వారికి చేయూతను ఇవ్వడం, సమన్యాయ వ్యవస్థలను నెలకొల్పడం పౌరసమాజ బాధ్యత కావాలి. నేను, నాకు అన్న స్వార్థ భావనను మరిచి మనం అన్న నినాదం పైకి రావాలి.

ఒక్కొక్కరు చేసేది బిందు సమానమని, అందరం కలిస్తే సాగరమంత సాఫల్యత సిద్ధిస్తుందని మరువరాదు. పోరుగు వారి ఉన్నతితోనే మన ఉత్తమ వ్యక్తిత్వం ప్రకటితం అవుతుందని మరువరాదు. దాతృత్వ గుణాన్ని ప్రోత్సహించడం, స్వచ్ఛంద కార్యకర్తగా ముందుండడం, సకారాత్మక మార్పుకు పూనుకోవడం, సమాజ ఉన్నతి కార్యక్రమాలను చేపట్టడం, ప్రపంచ సమస్యల పట్ల స్పష్టమైన అవగాహన కల్పించడం లాంటి అంశాలు ప్రతి ఒక్కరి నిత్య సూత్రాలు కావాలి. సమస్యలే కనిపించని సమ సమాజ స్థాపనకు మానవ సంఘీభావమే ఒక దివ్య ఔషధం కావాలి.

(20 డిసెంబర్ "అంతర్జాతీయ మానవ సంఘీభావ దినం'' సందర్భంగా)

-డా: మధు-9949700037

22 నుండి వైకుంఠ ద్వార దర్శనం.. ఉచిత టోకెన్ల జారీ

తిరుపతి, డిసెంబర్ 20:తిరుమలలో ఈనెల 22న శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనానికి ఉచిత టోకన్లను జారీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో తిరుపతిలోని 9ప్రాంతాల్లో 90కౌంటర్ల ద్వారా టికెట్ల మంజూరుకు ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా కౌంటర్లను టీటీడీ జేఈవో సదాభార్గవి తనిఖీ చేశారు.

తిరుపతిలోని విష్ణునివాసం, శ్రీనివాసం, గోవిందరాజస్వామి సత్రాలు, భూదేవి కాంప్లెక్స్, రామచంద్ర పుష్కరిణి, ఇందిరా మైదానం, జీవకోన హైస్కూల్, బైరాగిపట్టెడలోని రామానాయుడు హైస్కూల్, ఎంఆర్ పల్లిలోని జడ్‌పి హైస్కూల్‌లో కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కౌంటర్లలో 4 లక్షలకు పైగా సర్వదర్శనం టోకెన్ల కోటా పూర్తయ్యేవరకు మంజూరు చేస్తామని వెల్లడించారు. కౌంటర్ల వద్ద ప్రత్యేకంగా క్యూలైన్లు, బారీకేడ్లు ఏర్పాటు చేశామని, వేచి ఉండే భక్తులకు తాగునీరు, అల్పాహారం, టీ, కాఫీ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. టోకెన్లు, టికెట్లు పొందిన భక్తులను 24 గంటలు ముందు మాత్రమే తిరుమలకు అనుమతిస్తామని చెప్పారు. దర్శన టోకెన్లు ఉన్నవారిని మాత్రమే తిరుమల శ్రీవారి దర్శనానికి అనుమతిస్తామని, టోకెన్లు లేని భక్తులు తిరుమలకు వెళ్లవచ్చు గానీ దర్శనానికి అనుమతించబడరని, ఈ విషయాలను కౌంటర్ల వద్ద అనౌన్స్‌మెంట్ చేస్తామని చెప్పారు. తిరుపతిలోని అన్ని కౌంటర్ల వద్ద క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తామని, త్వద్వారా భక్తులు ఇతర ప్రాంతాల్లోని కౌంటర్లకు సులువుగా చేరుకోవడానికి వీలు కలుగుతుందని చెప్పారు. సర్వదర్శనం టోకెన్ల సమాచారం తెలుసుకుని ప్రణాళిక ప్రకారం తిరుమలకు వచ్చి స్వామివారి అనుగ్రహానికి పాత్రులుకావాలని కోరారు.

డాక్టర్ల నిర్లక్ష్యంతో గర్భిణీ మృతి

హైదరాబాద్, డిసెంబర్ 20:శంషాబాద్ మున్సిపల్ పట్టణంలోని సన్ రైజ్ ప్రైవేట్ హాస్పిటల్లో దారుణం చోటుచేసుకుంది. చికిత్స పొందుతున్న మహిళ డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా మృతిచెందింది. దీంతో మృతురాలి బంధువులు ఆందోళనకు దిగారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం దబిల్ గుడా గ్రామానికి చెందిన నిర్మల(30) అనే మహిళ గర్భసంచి సమస్యతో బాధపడుతూ మూడు రోజుల క్రితం సన్ రైజ్ హాస్పిటల్లో చేరింది. అయితే ఆమెకు శస్త్ర చికిత్స చేసిన డాక్టర్లు మరో రెండు రోజులు హాస్పిటల్లో ఉండాల్సిందిగా కోరారు. దీంతో ఐసీయూలో ఉన్న ఆమె పరిస్థితి అర్ధరాత్రి విషమించింది.

దీంతో డాక్టర్లకు బంధువులు చెప్పినా పట్టించుకోకపోవడంతో ఆమె ఆరోగ్యం మరింత విషమించి మృతి చెందింది. దీంతో మృతురాలి బంధువులు డాక్టర్లను నిలదీయడంతో చేతులెత్తేశారని మృతురాలి భర్త కుమార్ ఆరోపిస్తున్నాడు. ముమ్మాటికీ తన భార్యను డాక్టర్లే పొట్టన పెట్టుకున్నారని, తనకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీయడంతో హాస్పిటల్ యాజమాన్యం పోలీసులను ఆశ్రయించింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆందోళనకారులను అడ్డుకున్నారు. తన భార్యను అన్యాయంగా పొట్టన పెట్టుకున్న వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని మృతురాలి భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హాస్పిటల్ కు చెందిన డాక్టర్లు ఎవరూ కూడా అందుబాటులోకి రాకపోవడంతో హాస్పిటల్ ముందు మృతురాలి బంధువులు బైఠాయించారు.

కరోనా కేసులపై అప్రమత్తంగా ఉండండి.. కేంద్ర ఆరోగ్య శాఖ సూచన

న్యూఢిల్లీ, డిసెంబర్ 20:కరోనా వైరస్ కేసులపై అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఆరోగ్యశాఖ హెచ్చరించింది. కేరళలో కొవిడ్ -19 జేఎన్ 1 కొత్త సబ్ వేరియంట్ కేసుల ఆకస్మిక పెరుగుదలపై కేంద్రం అప్రమత్తమైంది. పెరుగుతున్న కొవిడ్ కేసులపై సమీక్షించడానికి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ బుధవారం సమావేశాన్ని నిర్వహించింది.

కేరళలో 292 కొత్త కొవిడ్ -19 యాక్టివ్ కేసులు, మూడు మరణాలు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అధికారులతో ఢిల్లీలో కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సమావేశమయ్యారు. ఆయా రాష్ట్రాల్లో కొవిడ్ కేసుల పెరుగుదల, ఆసుపత్రుల్లో వైద్య సేవల సంసిద్ధతపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాండవీయ మాట్లాడుతూ 'దేశంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి. అయితే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆసుపత్రుల్లో అన్ని సదుపాయాలు ఉండేలా చూడాలి. అన్ని ఆసుపత్రుల్లో ప్రతి 3 నెలలకోసారి మాక్‌డ్రిల్స్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలి. కరోనా పరిస్థితిలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలి. రాష్ట్రాలకు కేంద్రం అన్ని సహాయ సహకారాలు అందిస్తుంది. హెల్త్ ను రాజకీయ అంశంగా చూడొద్దు' అని అన్నారు.

తెలుగు గజల్

అన్నదాతలు రోధిస్తే దుర్భిక్షం ఓ దేశమా!
అన్నదాతలు సంతసిస్తే సుభిక్షం ఓ దేశమా!!

స్వేదజలంతో సేద్యంచేసి మన్నును అన్నంచేసి
దేశప్రజల ఆకలితీర్చే రైతేమనదైవం ఓ దేశమా!

భూమితల్లి దీవెనలున్నా వరుణుడు కరిణించినా
రైతులపైన పాలకులకు లేదుకనికరం ఓ దేశమా!

ఆరుగాలం శ్రమించి ఎన్నెన్నో పంటలను పండిస్తే
రైతుకుమాత్రం విక్రయించే విలులేదు ఓ దేశమా!

రైతునాగలి నడవకుంటే సాల్లల్లో విత్తుపడకుంటే
కరువు కాటకమే ఓదేవా! నిత్యక్షామం ఓ దేశమా!

- బూర దేవానందం
8143589789

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక

అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123
(ప్రథమ)

'బుధవారం బాద్షా'

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ

పుస్తక పఠనం

ఒక మంచి పుస్తకం కావాలి సర్వ వ్యాపకం!
నా కళ్ళుతెరిపించే పుస్తకమే నాకు సమస్తం!!

ఋణపడి యుంటాను దానికి జీవితాంతం!
బ్రతుకు దారి చూపించు చక్కగా సుఖాంతం!!

కష్టాలకడలినుండి గట్టెక్కించింది ఆసాంతం!
ఇష్టపడి కొని చదివే పుస్తకాలు నా స్వంతం!!

జీవితాలనే మార్చి తీర్చిదిద్దడానికి అనువుగా ఉండే
ఉచిత పుస్తకాలు గ్రంథాలయాలలో
సకల సౌకర్యాల లభ్యతలకు సమాధానం!
జీవితాన్ని సరిచేసుకోవడములో దోహదం!!
జీవితమేమిటో నేర్పించి చూపె గుణపాఠం!
పుస్తకమే కాంతి నిచ్చి వెలుగుచూపు దర్పణం!!

మస్తకాలకు పుస్తకాలు లేకుంటేనే ఖేదం!
ఈ-పుస్తకలెన్నివచ్చినా ఆ పుస్తకాలే సుఖం!!

సోఫాలోకూర్చొని తాపీగాచదివితే ఆనందం!
మనసుతో పుస్తకపఠనం జ్ఞానసముపార్జనం!!

అది అందరికీ అందిస్తే విజ్ఞాన మయ విశ్వం!
అజ్ఞానమును తొలగించు
విజ్ఞాన భాండాగారముతో సలక్షణ విలక్షణ
నిక్షిప్త సంక్షిప్త సమాహార చిరునామాలతో
మేధో మధనానికి పనికివచ్చే పుస్తకాలు!
మనం మరిచిపోలేని నేస్తాలు అవియే
హస్తభూషణాలు!!

-కాసుల ధీరాజ శర్మ
9440522864.

హస్తభూషణం

పుస్తక పఠనమొక పారవశ్యం
తీర్చునది అక్షర జిహ్వ దాహం
అంతర్జాలంలో నిక్షిప్తమైన విజ్ఞానం
హోటల్ భోజనంతో సమానం
పుస్తక పఠనంలో నిక్షిప్తమైన విజ్ఞానం
అది అమ్మ చేతి కమ్మని భోజనం.

పుస్తకం హస్త భూషణం
మస్తిష్కమేధను నింపే భోషాణం
పుస్తక పఠనంతో వ్యసనం దూరం
పుస్తక పఠనంతో వచ్చు అపార జ్ఞానం.

మానవ జాతి సంస్కృతి వికాసం
తరతరాలుగా పుస్తక ఆధారితం
అభివృద్ధి చెందినా సాంకేతిక పరిజ్ఞానం
పరిశోధనకై ఆశ్రయించక తప్పదు పుస్తకం .

పుస్తకం భూతవర్తమానభవిష్య కాలాల వారధి
అది తరతరాలకు విజ్ఞానాన్ని మోసే సారధి
సమస్త జ్ఞానాన్ని తనలో దాచుకున్న జలధి
అజ్ఞానాంధకారాన్ని హరించి వెలుగు పంచే పెన్నిధి
జ్ఞాన పరిజ్ఞానాన్ని ప్రసాదించు సన్నిధి.

పుస్తకం తరాలు మారినా వన్నెతరగని ఆభరణం
ఆస్వాది స్తే పుస్తకాన్నిఆపాదమస్తకం
అది అందలాన్ని ఎక్కించు సోపానం
పుస్తకం జీవితాంతం నమ్మదగిన నేస్తం.

-జె వి కుమార్ చేపూరి
హైదరాబాద్

కొలకలూరి పురస్కారాలు -2024

కొలకలూరి సాహిత్య పురస్కారాలు 16 సంవత్సరాలుగా వివిధ ప్రక్రియలకు ప్రదానం చేయటం జరిగింది. ఈ సంవత్సరం కూడా మూడు ప్రక్రియా గ్రంథాలకు మూడు పురస్కారాలు ప్రకటించగలగటం ముదావహం ఈ పురస్కారాలకు తెలుగు సాహిత్య స్రష్టలు, ప్రపంచంలో ఎక్కడున్నా అర్హులు.

1.కొలకలూరి భాగీరథి పురస్కారం-2024 -కథానిక - రూ - 15,000/-
2. కొలకలూరి విశ్రాంతమ్మ పురస్కారం 2024-నవల రూ.15,000/-
3.కొలకలూరి రామయ్య పురస్కారం-2024 - విమర్శనం - రూ. 15,000/-

ఆయా ప్రక్రియల్లో ప్రచురితమైన గ్రంథాలు నాలుగేసి ప్రతులు పంపండి. ముగ్గురు సాహితీవేత్తల సంఘాలు.. మూడు వీటిని పరిశీలించి, పురస్కార గ్రంథాలు నిర్ణయిస్తాయి. ఈ గ్రంథాలు జనవరి 1.1.2022 తర్వాత ముద్రితమై ఉండాలి.

రచయితలైనా, ప్రచురణకర్తలైనా తమ గ్రంథాలను ఈ దిగువ ఇచ్చిన చిరునామాలకు **15.1.2024** లోగా పంపాలి.పురస్కార ప్రకటన **15.2. 2024**న వెలువడుతుంది. **26.2.24**న హైదరాబాదులో జరిగే సభలో పురస్కారం ప్రదానం జరుగుతుంది.

కథానిక : ఒక్క రచయిత కథానికల సంకలనమే!
నవల: ఒక్క రచయిత రచన మాత్రమే

విమర్శనం: ఒక విమర్శకుడి ఒక విమర్శన గ్రంథం కానీ, విమర్శన వ్యాస సంకలనం కానీ కావచ్చు.ఒక్కొక్క పురస్కారానికి నగదు రూ.15,000/-, జ్ఞాపిక, శాలువా చొప్పున మూడు పురస్కారాలు ప్రదానం చేయబడతాయి.

ముద్రిత గ్రంథాలు పంపవలసిన చిరునామాలు :

1. కథానికా సంకలనాలు / నవలలు: ఆచార్య కొలకలూరి మధుజ్యోతి (సెల్ 94419 23172) తెలుగు శాఖాధ్యక్షులు & పరీక్ష విభాగం డీన్,అకడమిక్ అఫైర్స్ డీన్, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి - 517 502 ఆం.ప్ర.
2. విమర్శన గ్రంథాలు:ఆచార్య కొలకలూరి సుమకిరణ్ (సెల్: 99635 64664) ఆంగ్లాచార్యులు, ఆంగ్లశాఖాధ్యక్షులు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం,తిరుపతి - 517 502. ఆం.ప్ర.

-ఆచార్య కొలకలూరి మధుజ్యోతి
-ఆచార్య కొలకలూరి సుమకిరణ్

ఇటీవల గుంటూరులోని సి.పి.ఎం. కార్యాలయంలో జరిగిన డా॥ పట్టాభికళా పీఠం జాతీయస్థాయిలో నిర్వహించిన కవితల పోటీలో ప్రథమ బహుమతి పొంది, సన్మానింపబడిన ప్రముఖ కవి వి.ఎస్.వి. ప్రసాద్‌ను సన్మానిస్తున్న డా॥పట్టాభికళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు డా॥ తూములూరి రాజేంద్రప్రసాద్, సభాధ్యక్షులు డా॥ రామరాజు శ్రీనివాసరావు, నాగ సుబ్రహ్మాయకణ్యం, పొత్తూరి సుబ్బారావు.

కొత్త శీర్షిక ఈ వారం కొత్త కథ

త్వరలో నేటి నిజం దిన పత్రికలో
'ఈ వారం కొత్త కథ' శీర్షిక
ప్రారంభిస్తున్నాము.
మీ కథలు యూని కోడ